లెక్క తేలుస్తారా!?

రె'వెన్యూ'

- గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా భూముల పంపిణీ
- నేతలకే పందేరం!
- నేడు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా సమీక్ష
- అక్రమాలపై విచారణ ఏదీ!?
- భూ సమస్యల పరిష్కారంలోనూ నిర్లక్ష్యం

నెల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వంలో జరిగిన భూ అక్రమాలు అన్నీ ఇన్నీ కాదు. పేదల ఇళ్లకు భూమి కొనుగోలు మొదలు అసైన్‌మెంట్ పట్టాలు పంపిణీ చేసే వరకూ ప్రతిచోటా లెక్కలేనన్ని తప్పులు జరిగాయి. ఇళ్లకు భూమి కొనుగోలు, ఫ్రీహోల్డ్ పేరుతో అసైన్‌మెంట్ భూములు కొట్టేయడం వంటి అక్రమాలపై ఇప్పటికే విచారణలు జరుగుతున్నాయి. అయితే అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ వ్యవహారంపై మాత్రం ఇంతవరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పేదలు కాకపోయినా వైసీపీ నాయకులు అనే అర్హతతో గత ప్రభుత్వంలో ప్రభుత్వ భూములను ధారాదత్తం చేశారు. అసలు జిల్లాలో ఏ గ్రామంలో ఎవరికి భూములిచ్చారు? ఎంత భూమిని పంపిణీ చేశారు? అన్నది ఇప్పటికీ తెలియదు. చివరకు గ్రామసభలు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అసైన్‌మెంట్ వ్యవహారాన్ని కానిచ్చేశారు. ఇందులో ఉన్నతాధికారులు కూడా పాత్ర వహించడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చాక పొదలకూరు మండలంలో జరిగిన అక్రమ వ్యవహారాలపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో అక్కడ విచారణ జరిగింది. వందల ఎకరాల ప్రభుత్వ భూమిని భూస్వాములకు ధారాదత్తం చేసినట్లు తేలింది. ఈ వ్యవహారంలో అప్పటి తహసీల్దార్‌ను బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు తప్ప తదుపరి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ అక్రమార్కుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోలేదు. ఒక్క పొదలకూరు మండలంలోనే ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు బయటపడితే ఇక జిల్లా మొత్తం ఎన్ని వందల, వేల ఎకరాల కొట్టేశారో అర్థం చేసుకోవచ్చు.

● పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం

ఎన్ని గ్రామసభలు నిర్వహించినా.. మరెన్ని సమావేశాల ద్వారా అర్జీలు స్వీకరించినా.. రెవెన్యూ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఈ ప్రభావం ప్రజలపై తీవ్రంగా పడుతోంది. జిల్లా ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నా క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఒకసారి వచ్చిన అర్జీదారుడే మళ్లీ అదే సమస్యతో ఉన్నతాధికారుల వద్దకు వస్తున్నారు. మరోవైపు ఈ అర్జీల పరిష్కారంపై ఆడిట్ నిర్వహిస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలపై దృష్టి పెట్టింది. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సదస్సులు నిర్వహించింది. 300కు పైగా గ్రామాల్లో గతేడాది అక్టోబరు 19 నుంచి నవంబరు 14వ తేదీ వరకరూ రెవెన్యూ సదస్సులు జరిగాయి. అప్పుడు 8406 అర్జీలు అందాయి. ఆ తర్వాత మరోసారి గతేడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వరకూ 731 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా, 8,132 అర్జీలు అందాయి. వీటిలో సగం వరకూ అర్జీలు పరిష్కారమైనట్లు లెక్కలు చూపిస్తున్నారు. ఇలా రెండు విడతల్లో జరిగిన గ్రామసభల్లో 16 వేలకు పైగా అర్జీలు నమోదైనప్పటికీ ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజావిజ్ఞప్తుల కార్యక్రమం (గ్రీవెన్స్)లో భూ సమస్యలకు సంబంధించిన అర్జీల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. దీనిని బట్టి క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సమస్య పరిష్కారం కాలేదంటూ రీఓపెన్ అవుతున్న అర్జీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. ఆఖరుకు సీఎం కార్యాలయం నుంచి వస్తున్న అర్జీలు కూడా పరిష్కారం కాక రీఓపెన్ అవుతుండటం గమనార్హం.



సిసోడియాకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఆనంద్

● నగరంలో సిసోడియా

రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీరాం ప్రసాద్ సిసోడియా గురువారం రాత్రి నెల్లూరుకు విచ్చేశారు. ఈ హోటల్ వద్ద కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, కావలి, ఆత్మకూరు ఆర్డీవోలు స్వాగతం పలికారు. శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులతో ఆయన సమావేశమవుతారు. రెవెన్యూ శాఖ పనితీరు, సమస్యల పరిష్కారంపై అధికారులతో సమీక్షించనున్నారు.

వందకు వంద!

- ప్రభుత్వ వైద్య కళాశాలలో నూరుశాతం రిజల్ట్స్
- ఒకరికి డిస్టింక్షన్, 56 మందికి ప్రథమశ్రేణి
- సంపూర్ణ ఫలితాలు ఇదే మొదటిసారి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ ఫలితాలలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. 2020 బ్యాచ్‌కి చెందిన 177 మంది మెడికోలు పరీక్షలు రాయగా ఫలితాలలో ఒకరికి డిస్టింక్షన్ రాగా 56 మందికి ప్రథమ శ్రేణి, 120 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉండగా ఒక్క నెల్లూరులోని ప్రభుత్వ వైద్యకళాశాలలోనే మెడికోలంతా ఉత్తీర్ణత సాధించారు. 2014లో 100 మంది వైద్య విద్యార్థులతో ఈ కళాశాల ప్రారంభమవగా 2019లో మొదటి బ్యాచ్ వైద్యవిద్యను మెడికోలు పూర్తి చేశారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు ఏడు బ్యాచ్‌లు వైద్య విద్యను పూర్తి చేశాయి. పూర్తి చేసుకున్న 5 బ్యాచ్‌లు ఫైనల్ ఇయర్ ఫలితాలలో కేవలం 75 నుంచి 80 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదయింది. 6వ బ్యాచ్ మెడికోలు (2016-20) 93.9 శాతం మంది పాస్ అయ్యారు. అప్పట్లో 164 మంది రాయగా అందులో 154 మంది మెడికోలు ఉత్తీర్ణత సాధించారు. తాజాగా 177 మంది పరీక్ష రాస్తే అందరూ ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

సమష్టి కృషితోనే..



ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో 100 శాతం ఫలితాలు రావటం ఇదే మొదటిసారి. ఇదంతా అధ్యాపకులు, ఇతర వైద్యాధికారుల కృషే. నేను ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ ఉత్తమ ఫలితాలు రావటం ఎంతో ఆనందగా ఉంది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు వారు కోరుకున్న చోట హౌస్‌సర్జన్ చేసే అవకాశం ఉంటుంది.

- డాక్టర్ నాగ రాజమన్నార్, వైద్య విద్య కళాశాల ప్రిన్సిపాల్



బుచ్చిరెడ్డిపాళెం : చెల్లాయపాళెం వద్ద రోడ్డుపై ధాన్యపు రాశులు

ఆదిలోనే వర్రీ!

- దిగుబడి లేదు.. ధర ఊసే లేదు!
- గిట్టుబాటు కాని ప్రభుత్వ రేటు
- ఇదే అవకాశంగా వ్యాపారులు, దళారులు
- లబోదిబోమంటున్న అన్నదాతలు



కొండాపురం: ధాన్యాన్ని తూకం వేస్తున్న కూలీలు

కొండాపురం/బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వరి సాగుచేసిన రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మరింది. ఎన్నడూలేని విధంగా ధాన్యం దిగుబడి సగానికి పడిపోవడంతో దిక్కుతోచని స్థితితో రైతాంగం ఉంది. సాధారణంగా ఎకరా పొలంలో 50 బస్తాలకుపైగా (ఒక్కో బస్తా 75 కిలోలు) దిగుబడి వచ్చేది. అయితే ఈసారి 30 బస్తాలు కూడా రాలేదని వాపోతున్నారు. దీనికితోడు ఆశించిన ధర కూడా లభించడం లేదు. ఈసారి జిల్లాలో సుమారు 3.5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఇప్పుడు కోతలు మొదలయ్యాయి. ఒక ఎకరా విస్తీర్ణంలో వరి సాగు చేయాలంటే దుక్కి, నాట్లు, ఎరువులు, పురుగు మందులు, కూలీలు, హార్వెస్టింగ్ తదితరాలతో కలిపి రూ.45 వేల వరకు ఖర్చవుతుంది. ఇక కౌలు భూమి అయితే అదనంగా రూ.10 వేల నుంచి 15వేల వరకు అవుతుంది. ఈఏడాది సాగునీటి ఇబ్బందులు లేకపోవడంతో రైతన్నలకు ఇబ్బందులు ఎదురవ్వలేదు. కొండాపురం మండలంలో తక్కువ కాలపరిమితితో కూడిన షుగర్‌లెస్ (ఆర్ఎస్ఆర్), కేఎన్ఎం వరి విత్తనాలను ఎక్కువగా సాగు చేశారు. అక్టోబరులో వరి నారుమడులు సిద్ధం చేసుకొని నవంబరులో నాట్లు పూర్తిచేశారు. గతేడాది ఈ వరి ఎకరానికి 50 బస్తాలపైనే దిగుబడి రాగా, మార్కెట్లో 75 కేజీల బస్తాను రూ.2వేలకు అమ్ముకున్నారు. అయితే, ఈ ఏడాది అందుకు భిన్నంగా ఒక ఎకరాలో 25 నుంచి 35 బస్తాలలోపు ధాన్యం దిగుబడి రావడం, మార్కెట్లో బస్తా రూ.1700 పలుకుతోంది.

● ప్రభుత్వ ధర రూ.1740

కూటమి ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి 75 కేజీల బస్తాకు రూ.1740, బీ గ్రేడుకు రూ.1,725ల మద్దతు ధరగా ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలంటే అధికారులు సూచించిన నాణ్యతా ప్రమాణాలు పాటించాలి. ఇది రైతులకు అదనపు భారంగా మారింది. ప్రభుత్వ మద్దతు ధరకు, వ్యాపారుల ధరకు పెద్దగా వ్యత్యాసం లేదు. దీంతో ఎక్కువ మంది రైతులు వ్యాపారులకే ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. ఇక బుచ్చిరెడ్డిపాళెం మండలంలో 9వేల ఎకరాలకుపైగా వరి సాగు చేయగా, పది రోజుల క్రితమే వరి కోతలు మొదలయ్యాయి. పుట్టి (850 కిలోలు) ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర రూ.19,720. మిల్లర్లు, దళారుల వద్ద రూ.17 వేల నుంచి 17,500 పలుకుతోంది. దీంతో రైతులు కోసిన ధాన్యం రోడ్ల మీద పోసుకుని కాపుకాయలేక దళారులకే అమ్ముకుంటున్నారు. దీంతో పుట్టి ధాన్యానికి రూ.2,720 నుంచి 2,220 మేర నష్టపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు గోదాములు ఏర్పాటు చేసి ఆదుకోవాలని రైతాంగం కోరుతోంది.

పెట్టుబడులు కూడా రావేమో!



నా భూమితోపాటు మరి కొంత భూమిని కౌలుకు తీసుకొని 8 ఎకరాలలో వరి సాగుచేశాను. పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎకరాకు 25 నుంచి 30 బస్తాల ధాన్యం దిగబడి వస్తుంది. పెట్టిన పెట్టుబడులు రావేమో. గతంలో ఎప్పుడూ ఇంత తక్కువ దిగుబడి రాలేదు.

- జీ.మాల్యాద్రి, భీమవరప్పాడు, కొండాపురం

అప్పు చేయాల్సి వస్తోంది



9 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాను. ఎకరానికి కౌలుతో కలిపి రూ.45-50 వేల వరకు ఖర్చు అయ్యింది. ఎకరానికి 30 బస్తాల లోపు ధాన్యం దిగుబడి వచ్చింది. ఇది పెట్టుబడులు, కౌలుకు కూడా సరిపోదు. చేసిన శ్రమ అంతా వృథా. పైగా అప్పుచేయాల్సిన పరిస్థితి నెలకొంది.

- ఇండ్ల నారాయణ, నేకునాంపేట, కొండాపురం

గిట్టుబాటుకాకున్నా ఆరబోసుకోలేక అమ్ముకుంటున్నాం



ఈసారి పంట దిగుబడే అనుకుంటే ధాన్యానికి కూడా గిట్టుబాటు ధర కూడా లభించలేదు. రోడ్డుమీద ఆరబోసుకుని కాపలా కాయలేక, ఒకవేళ ఆరబోసినా గోడౌన్ల వసతి లేదు. దీంతో వచ్చినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది.

- కదురు బాబు, చెల్లాయపాళెం, బుచ్చి మండలం

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించండి

- సివిల్ సప్లయిస్ అధికారులతో జేసీ కార్తీక్



జాయింట్ కలెక్టర్‌కు క్యాలెండర్‌ను అందజేస్తున్న జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి హరికృష్ణ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని శంకరన్ హాల్లో ధాన్యం సేకరణపై సివిల్ సప్లయిస్ అధికారులతో సమీక్ష జరిగింది. ఆయన మాట్లాడుతూ త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవు తాయని చెప్పారు. వాటిలో రైతుల నుంచి ధాన్యం సేకరణ వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ధాన్యానికి సంబంధించి రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చూడాలన్నారు. మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలను త్వరగా సమర్పించాలన్నారు. కొరత లేకుండా గోతాలు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్‌వో అంకయ్య, సివిల్ సప్లయిస్ కార్పొరేష న్ మేనేజర్ లక్ష్మీనారాయణ, తూనికల కొలతల శాఖ అధికారులు పాల్గొన్నారు.

జేసీని కలిసిన జిల్లా సైనిక సంక్షేమాధికారి

జిల్లా సైనిక సంక్షేమ అధికారి జీ హరికృష్ణ గురువారం జాయింట్ కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సైనిక సంక్షేమ శాఖ క్యాలెండర్‌ను అందజేశారు.

టిడ్కోలో వాక్ టు వర్క్!

- పేదల కోసం కూటమి ప్రభుత్వం బృహత్తర ప్రాజెక్టు
- వస్తు తయారీ, అమ్మకాలకు దుకాణాల నిర్మాణం
- రెండు దశల్లో రూ.11.52 కోట్లతో ఏర్పాటు
- వెంకటేశ్వరపురం వద్ద అందుబాటులోకి...



టిడ్కో సముదాయం

పట్టణ పేదలకు శాశ్వత జీవనోపాధి చూపే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులో వేస్తోంది. వెంకటేశ్వరపురంలోని టిడ్కో సముదాయం వద్ద వస్తు తయారీ, అమ్మకాల కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. రూ.11.52 కోట్లతో నిర్మించే ఈ షాపులను నవంబరులోపు అందుబాటులోకి తీసుకువచ్చే భారీ ప్రణాళికకు పురపాలక శాఖ బుధవారం అధికారికంగా జీవో విడుదల చేసింది రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాలలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో నెల్లూరును కూడా చేర్చారు.

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని పేద కుటుంబాలలో వివిధ వస్తు తయారీ, అమ్మకాలలో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి వారిలో జీవనోపాధిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'వాక్ టు వర్కు' పేరిట టిడ్కో సముదాయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తీసుకురానున్నది. వెంకటేశ్వరపురం వద్ద తొలి విడతలో పూర్తయిన 4,800 ఇళ్ల సముదాయం వద్ద పేదలను గుర్తించి ఈ ప్రాజెక్టులో ప్రత్యక్ష భాగస్వామ్యం చేయనున్నారు. పీఎంఏవై పథకం కింద ఆర్థిక చేయూతనిస్తూ 96 షాపులలో తొలివిడతగా 56 షాపులను జూన్‌లోపు పూర్తి చేసేందుకు రూ.6.72 కోట్లు విడుదల చేయను న్నారు. అటు కార్పొరేషన్, ఇటు నుడాల ద్వారా నిధులను ప్రాథమికంగా అందచేసి 33,600 చ.అ విస్తీర్ణంలో ఈ షాపులను నిర్మించనున్నారు. మలివిడతలో రూ.4.8 కోట్లు కేటాయించి నవంబరులోపు 40 షాపులను నిర్మించను న్నారు. ఆర్థిక వృద్ధిని పెంపొందించడంతోపాటు పేద కుటుంబాలకు జీవనోపాధి, శాశ్వత నిర్మాణాలతో వ్యాపార రంగాలను పటిష్టం చేయాలన్న ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును అమల్లోకి తీసుకు వస్తున్నట్లు పురపాలక శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

ముక్కంటి మహోత్సవం



విద్యుద్దీపాలంకరణలో గాలిగోపురం

నేటి నుంచి మూలస్థానేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని భువనేశ్వరీ సమేత మూలస్థానేశ్వరాలయంలో శుక్రవారం నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. మార్చి 5వతేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు పాలకవర్గం, అధికారులు భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

● ఆలయ చరిత్ర

భక్తులకు కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మూలస్థానేశ్వరాలయం 11వ శతాబ్దానికి చెందినది. స్వామివారు ఇక్కడి ఉసిరి చెట్టుకింద పుట్టలో స్వయంభుగా వెలిశారని స్థల పురాణం చెబుతోంది. నాటి ముక్కంటి రాజులకు చెందిన గోవులలో ఒకటి రోజూ ఆ పుట్ట వద్దకు వచ్చి పరమేశ్వ రుడికి పాలధార విడిచేది. ఇంటి దగ్గర ఆ ఆవు పాలు ఇవ్వకపోవడంతో గోవులకాపరి దానిపై నిఘా ఉంచాడు. గోమాత ఉసిరి చెట్టు కింద ఉన్న పుట్టలో పాలధారను విడవడం చూసి ఆగ్రహంతో ఆ పుట్టను కత్తితో నరికాడు. దీంతో శివలింగానికి గాయమై రక్తం కారింది. ఈ విషయాన్ని గోపాలకుడు ముక్కంటి రాజుకు తెలిపాడు. ఆ రోజు రాత్రి పరమశివుడు ముక్కంటిరాజు కలలో కనిపించి తనకు ఈ ప్రాంతంలో ఆలయం నిర్మించమని ఆదేశిస్తాడు. అంతట రాజు ఆలయాన్ని నిర్మించారు.

● బ్రహ్మోత్సవాలు ఇలా...

శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం సాయంత్రం అంకురార్పణ, శనివారం ఉదయం ధ్వజారోహణ, రాత్రి సింహ వాహన సేవ, 23వతేదీ ఉదయం చప్పర ఉత్సవం, రాత్రి పురుషామృగ వాహనసేవ, 24 రాత్రి శేషవాహన సేవ, 25 వెండి రావణసేవ జరుగుతాయి. 26వతేదీ శివరాత్రి పర్వదినాన ఉదయం గిన్నెభిక్ష అలంకరణ, రాత్రి లింగోద్భవకాల అభిషేకం, అనంతరం వెండి నంది వాహనసేవ, 27వతేదీ రాత్రి కల్యాణం, 28వతేదీ ఉదయం రథోత్సవం, మార్చి 1న యాళి వాహన సేవ, 2న అలకల తోపు, 3న ధ్వజావరోహణ, 4న దవనోత్సవం, 5వతేదీ ఏకాంతసేవ జరుగుతాయి.



ఆసుపత్రితో ఆటలు !

- జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై విమర్శల వెల్లువ
- రెండు నెలలు సెలవు పెట్టి ఆలస్యంగా అనుమతులు
- ఎఫ్‌ఏసీ ఇవ్వక పోవటంతో నిర్వహణ ఇబ్బందులు



సిద్దా నాయక్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నిర్వహణ అగమ్యగోచరంగా మారుతోంది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ సెలవుల విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఆయన ఈ నెల 15వ తేదీ నుంచి రెండు నెలలపాటు సెలవుపై వెళ్లారు. ఇందుకు డీఎంఈ అనుమతి తీసుకోవాల్సి ఉండగా లీవు లెటరు డీఎంఈకి పంపకుండా ఆసుపత్రిలోనే ఉంచారు. ఈ విషయాన్ని జీజీహెచ్ అభివృద్ధి కమిటీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమైంది. ఆ సమాచారం అందుకున్న సూపరింటెండెంట్ వెంటనే డీఎంఈకి లీవ్ లెటర్ పంపించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఈ నెల 18న లీవ్ లెటర్‌ను డీఎంఈకి పంపించారు.

మొదటి నుంచీ అంతే..

సిద్దా నాయక్ 2022 ఆగస్టు 4న సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. అది నుంచి వివాదాస్పదుడిగా విమర్శలున్నాయి. ఎప్పుడు సెలవు పెట్టినా డీఎంఈ అనుమతి తీసుకోరని, సెలవులోనూ విధుల్లో ఉన్నట్లు చూపించారన్న అభియోగాలున్నాయి. మాసానికి రూ.3.50 లక్షలు వేతనం తీసుకుంటున్న సూపరింటెండెంట్ ఆసుపత్రి నిర్వాహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనికి తగ్గట్లే గతంలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాల్లో సూపరింటెండెంట్ వ్యవహార శైలిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. పదేపదే హెచ్చరిస్తున్నా తీరు మారదా అని ప్రశ్నించి సెలవుపై వెళ్లాలని కూడా సూచించారు.

ఎఫ్‌ఏసీ లేక ఇబ్బందులు

సూపరింటెండెంట్ 14 రోజులకుపైగా సెలవు పెట్టినప్పుడు వేరే వైద్యునికి ఎఫ్‌ఏసీ(ఫుల్ అడిషనల్ చార్జి) ఇవ్వాల్సి ఉంటుంది. ఈ మేరకు డీఎంఈకి సిఫార్సు చేయాలి. అయితే సిద్దా నాయక్ రెండు నెలలు సెలవు పెట్టినా ఎఫ్‌ఏసీ మాత్రం ఎవరికీ ఇవ్వకుండా వెళ్లారని తెలిసింది. దీంతో ఆసుపత్రి నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద రోగులకు బస్ చార్జీలు ఇవ్వడానికి కూడా ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రికి వచ్చే వారిలో నిరుపేదలే జాస్తి కావడంతో ఉద్యోగులు వారి సొంత డబ్బులు చెల్లిస్తున్నారని తెలిసింది. కాగా, ఎఫ్‌ఏసీ అమలుకు సీనియర్ వైద్యుల వివరాలు పంపించాలని డీఎంఈ డాక్టర్ నరసింహం నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రిన్సిపాల్ కొందరు వైద్యుల పేర్లు పంపించినట్లు సమాచారం.

ఎఫ్‌ఏసీ ఇవ్వకపోవటం వల్లే ఆర్థిక ఇబ్బందులు



జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్ రెండు నెలలకుపైగా సెలవు పెట్టి వెళ్లారు. అయితే ఎఫ్‌ఏసీ ఇవ్వకపోవటం వల్ల ఆసుపత్రి నిర్వహణ కష్టంగా మారుతోంది. వేసవి కాలం సమీపిస్తున్నందున తాగునీటి వ్యవస్థను మెరుగుపరచేందుకు నిధులు అవసరం. కనీసం రూ. 10 వేలు ఖర్చు పెట్టుకునేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది.

- డాక్టర్ నరేంద్ర, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

బీఎస్‌ఎన్‌ఎల్ ఆదాయం రూ.50కోట్లకు పెంచాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ రూ.33 కోట్ల ఆదాయంలో ఉంది. దీనిని రూ.50 కోట్ల ఆదాయం పెంచేందుకు టెలికం అడ్వయిజరీ కమిటీ, అధికారులు సంయుక్తంగా కృషి చేయనున్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం కార్యాలయంలో టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు. వివరాలను ఎంపీ వేమిరెడ్డి విలేకరులకు వెల్లడించారు. బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇకపై ప్రతి ఆరు నెలలకోసారి కమిటీ నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధాని మోదీ ప్రతి గ్రామానికి భూగర్భ ఫైబర్ నెట్ ద్వారా ఇంటర్నెట్ అందించాలనే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. 4జీతోపాటు 5జీ సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ పెట్టుబడులు పెడుతుందని తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ జీఎం సి.అమరేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు రమణయ్య, మాల్యాద్రి, బొప్పరు ప్రసాద్, కె.బ్రహ్మానందం, గోపాల్, అనూష, వి.సురేంద్రరెడ్డి, డీజీఎం ఎం.శ్రీనివాసరావు, ఐఎఫ్‌ఏ ఎం.శ్రీనివాసరావు, ఏజీఎం పి.శ్రీనివాసరావు, పి.అపర్ణ, సేల్స్ అండ్ మార్కెటింగ్ ఏజీఎం వి.రామ్మోహన్ పాల్గొన్నారు.



టెలికం అడ్వయిజరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి, బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు

23న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్

- ఏడు కేంద్రాల్లో పరీక్ష : కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఈనెల 23న జరుగుతుందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఆ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం పరీక్ష నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కోవూరు మండలం గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాల, నెల్లూరులోని వీఆర్ పీజీ స్టడీస్, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వెంకటాచలం సమీపంలోని క్యూబా ఇంజనీరింగ్ కళాశాల, కలివెలపాలెం, ధనలక్ష్మీపురంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్, నెల్లూరు రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆ ఏడు కేంద్రాలకు ఏడుగురు లైజనింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. మొత్తం 4,102 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు ఆయన చెప్పారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరీక్షలకు సంబంధించి సాంకేతికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరీక్షల కో ఆర్డినేటింగ్ అధికారి, కందుకూరు సబ్ కలెక్టర్ టీ శ్రీపూజ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణవేణి కూడా పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

- జడ్పీ సీఈవో విద్యారమ ● ఎమ్పీడీవో కార్యాలయం ఆకస్మిక తనిఖీ

కావలి రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పరిషత్ సీఈవో ఎం.విద్యారమ ఆదేశించారు. గురువారం ఆమె స్థానిక ఎమ్పీడీవో కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించి మాట్లాడారు. పంచాయతీ, మండల పరిషత్ నిధులతో చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న ఎంపీడీవోను చర్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిని దృష్టి లో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ క్రిష్ణతేజ ఆదేశాల మేరకు అన్నిమండలాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. అలాగే కావలి, నెల్లూరు, ఆత్మకూరు, కందుకూరు డివిజన్లలో డీఎల్‌పీవో కార్యాలయాల నిర్మాణానికి స్థల సేకరణ జరుగుతుందన్నారు. పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశించి ఆధార్‌లు లేని చిన్నారుల సర్వే, సిటిజన్ హౌస్ జియో ట్యాగింగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్ సర్వేపై సూచనలిచ్చారు. కార్యక్రమం లో ఎమ్పీడీవో శ్రీదేవి, ఏవో సంధ్యారాణి, ఎంఈవో గోవిందయ్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఏఈ లు సతీష్, సుబ్రమణ్యం, ఈవోపీఆర్డీ సమద్, కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జడ్పీ సీఈవో

తెలుగు.. వెలుగు కోసం!

- వెంకటాచలంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఏర్పాటు
- భాషపై విస్తృత పరిశోధనలు, ప్రాజెక్టులు
- కవులు, రచయితలకు సత్కారాలు
- నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రతి మనిషి తన జీవితంలో తొలిసారిగా నేర్చుకునేది మాతృభాష. ఇది మనిషికి ఎంతో విలువైనది. అమ్మ పలుకులోని ఆప్యాయత, అనురాగం మరెక్కడా దొరకదు. తల్లి ఒడే బిడ్డకు తొలిబడి. అమ్మ మాటే మాతృభాష. ప్రతి మనిషి అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషనూ కాపాడుకోవాలి. అయితే, ఆధునిక పోకడతో మాతృభాషను నిర్లక్ష్యం చేస్తూ పరభాషా వ్యామోహంతో పరుగులు తీస్తున్నారు. జీవితంలో ఎదగాలంటే ఇతర భాషలను నేర్చుకోవడం అవసరమే. కానీ వాటి ప్రభావం అమ్మభాషపై పడకుండా చూసుకోవాలి. మన మాతృభాషను మనమే రక్షించుకోవాలి. తెలుగు భాష విస్తృతి, పరిశోధనల కోసం కేంద్ర ప్రభుత్వం వెంకటాచలంలో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. దాదాపు ఆరేళ్లుగా ఈ కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలపై ప్రత్యేక కథనం...

- వెంకటాచలం (ఆంధ్రజ్యోతి)



ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం

తెలుగు భాషాభిమానులు చేపట్టిన ఉద్యమ ఫలితంగా 2008లో తెలుగు భాషను ప్రాచీన విశిష్ట భాషగా గుర్తిస్తున్నట్లు అప్పటి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించింది. ఆ తర్వాత 2009లో తెలుగు భాషకు ప్రాచీన హోదా ఇస్తూ ఆమోదం తెలిపింది. 2011లో తెలుగు భాష విశిష్ట అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించాలని విద్యాత్మక, ఆర్థిక అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2018లో కర్ణాటకలోని మైసూరులో ఉన్న భారతీయ భాషా సంస్థలో తెలుగు భాష కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు చొరవ కారణంగా 2019, నవంబరులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని నెల్లూరుకు తీసుకొచ్చారు.

● తెలుగు భాషా అభివృద్ధికి కృషి

వెంకటాచలం మండలం సరస్వతీ నగర్ వద్ద ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పారు. ఈ కేంద్రంలో సంచాలకులతోపాటు 12 మంది విద్యాత్మక సిబ్బంది ఉండగా, తెలుగు భాషాభివృద్ధికి, సాహిత్యాలపై వీరంతా అధ్యయనాలు చేస్తున్నారు. ఈ కేంద్రం ప్రారంభమైన నాటినుంచి ప్రాచీన తెలుగు భాషకు సంబంధించి అనేక ఆధారాలు సేకరించి, పరిశోధనలు చేశారు. పూర్తయిన ప్రాజెక్టులను ముద్రణ రూపంలోకి తేవడానికి సంస్థ సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ కృషి చేస్తున్నారు. వివిధ ప్రాంతాలతోపాటు కళాశాలల్లోనూ సదస్సులు నిర్వహించి తెలుగు సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

● పండితులకు పురస్కారాలు

ప్రాచీన తెలుగు భాషకు తమ రచనల ద్వారా విశేష కృషి చేసిన భాషా పండితులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రూ.లక్ష నగదు ఇచ్చి సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. అలాగే వారిని సన్మానించి, గౌరవ పురస్కారాలు అందజేస్తున్నారు. అలాగే, రచయితలు, కవులకు కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రపతి పురస్కారాలను అందజేయ నుంది.

● గ్రంథాల డిజిటలీకరణ

తెలుగు భాషను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానం చేస్తూ భాషను డిజిటలీకరణ చేశారు. తెలుగు కావ్యాలను ఆంగ్లం, ఇతర భారతీయ భాషల్లోకి అనువాదం చేస్తున్నారు. ఇటీవలే క్రీడాభిరామం తమిళంలోకి, కవిజనాశ్రయం, సంకీర్తన లక్షణం కన్నడంలోకి అనువాదం చేశారు.

● 23 పరిశోధనలు పూర్తి

ఈ కేంద్రంలో ఇప్పటివరకు 23 అంతర్గత, బాహ్య పరిశోధనలు పూర్తయ్యాయి. బాహ్య ప్రాజెక్టులలో ఒకటి తెలుగువారి శాసనాలు ప్రచురించ బడ్డాయి. మిగిలిన బాహ్య ప్రాజెక్టులు త్వరలో ప్రచురించ బడతాయి. 12 అంతర్గత, 5 బాహ్య ప్రాజెక్టులు ప్రస్తుతం జరుగు తున్నాయి.

● గ్రంథాలయ స్థాపన

తెలుగు అధ్యయన కేంద్రంలోనే 2020-21లో గ్రంథాలయాన్ని స్థాపించారు. దాదాపు రూ.4.75 లక్షలు విలువ చేసే 2500 పుస్తకాలను కొనుగోలు చేశారు. అలాగే దాతల నుంచి సుమారు ఐదువేల పుస్తకాలను సేకరించారు. విలువైన ప్రాచీన పుస్తకాలను తెలుగు పండితులు విరాళంగా ఇవ్వడానికి ముందుకొస్తున్నారు. త్వరలో ఈ గ్రంథాలయం తెలుగులో సివిల్ పరీక్షలు, వివిధ పోటీ పరీక్షలు రాసేవారికి ప్రధాన సమాచార కేంద్రంగా మారబోతోంది.

అభివృద్ధికి నోచుకోక..

దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం పరిస్థితి. ఈ కేంద్రం నెల్లూరులో ఏర్పాటు చేసి ఆరేళ్లవుతున్నా ఇప్పటికీ తాత్కాలిక భవనంలోనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. 2023లో రాష్ట్ర ప్రభుత్వం 5 ఎకరాల భూమిని కేటాయించగా 2024లో కేంద్ర ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో ప్రహరీ గోడ నిర్మాణం, ఆర్చి, గార్డ్ రూమ్ నిర్మాణాలు జరుగుతున్నాయి. కానీ సొంత భవనానికి నోచుకోలేదు. అలాగే ఈ కేంద్రం ఏ నిర్ణయం తీసుకోవాలన్నా మైసూర్‌లోని భారతీయ భాషా సంస్థపైన ఆధారపడాల్సి వస్తోంది. దీనికి కారణం స్వయం ప్రతిపత్తి లేకపోవడమే. పక్క రాష్ట్రమైన తమిళ నాడులో తమిళ భాష కేంద్రానికి స్వ యం ప్రతిపత్తి ఉండటం గమ నార్హం. ఈ కేంద్రానికి కూడా స్వ యం ప్రతిపత్తి హోదా కల్పించాలని భాషాభిమానులు, పండితులు కోరుతున్నారు.

● పరిశోధన పత్రిక ప్రారంభం

తెలుగుసిరి పేరుతో పరిశోధన పత్రికను ప్రారంభించారు. గత ఏడాది జులై 13న తెలుగుసిరి మొదటి సంపుటిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఆవిష్కరించారు. ఈ పత్రికలో పరిశోధకులు, పండితులు రాసిన వ్యాసాలు, సదస్సుల్లో సమర్పించిన వ్యాసాలను ప్రచురిస్తున్నారు.

త్వరలో డిప్లమా కోర్సు



తెలుగు భాషను నేర్చుకునేవాళ్లకు త్వరలో ప్రాచీన సాహిత్యంలో డిప్లొమా కోర్సు ప్రారంభించ బోతున్నాం. భవిష్య త్తులో తెలుగు చరిత్ర, భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయం ఇలా తెలుగువారికి సంబంధించిన అనేక విషయాలను ఈ కేంద్రం కేంద్రబింధువుగా మారబోతుంది. త్వరలో ఐదు ఎకరాల సువిశాల స్థలంలో శాశ్వత భవనాన్ని నిర్మించనున్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం రూ.2కోట్లు మంజూరు చేయడంతో ప్రహరీ గోడ నిర్మించాము. మిగిలిన ఆర్చి, గార్డ్ రూమ్ నిర్మాణాలు పూర్తికావాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కేంద్రం మరింత అభివృద్ధి చెందనుంది.

- మాడభూషి సంపత్‌కుమార్, సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం


మాతృభాషను మరవద్దు



మనం తెలుగు వార మైనందున మాతృభాష అయిన తెలుగును ఎన్నటికీ మరువరాదు. ప్రపంచ భాషల్లో తెలుగు భాషకు ప్రత్యేక స్థానముంది. ఆ స్థానాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలుగుజాతిపై ఉందని ప్రతిఒక్కరూ గుర్తించి తెలుగుభాష వ్యాప్తికి పాటుపడాలి.

- రామాయణం దుర్గాప్రసాద్, ఉదయగిరి

మృతభాష కాకుండా చూడాలి



మాతృభాషలో విద్యా బోధన జరగాలి. మాతృ భాషలో విద్యను అభ్యసించిన వారికి ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఎక్కడైతే అన్నీ రంగాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు మాతృభాషలో జరుగుతాయో ఆ ప్రాంతం అభివృద్ధి పథంలో ఉంటుంది. ప్రభుత్వం మాతృభాష అమలులో కఠినంగా వ్యవహరించాలి. అప్పుడే మాతృభాషలు మృత భాషలు కావు.

- డాక్టర్ పెరుగు రామకృష్ణ, అంతర్జాతీయ కవి, నెల్లూరు.

ప్రాధాన్యతతోనే మాతృభాషకు ప్రాచుర్యం



రాష్ట్రప్రభుత్వాలు మాతృభాషకు తగిన ప్రాధాన్యత కల్పించినప్పుడే భాషకు ప్రాచుర్యం లభిస్తుంది. గిడుగురామ్మూర్తి లాంటి ఎందరో మహానుభావులు తెలుగు భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసారు. ఆయన జయంతి రోజును మాతృభాషా దినోత్సవం జరుపుకోవడం సాంప్రదాయంగా మారిందే తప్ప భాషాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం. ప్రభుత్వాలు పూనుకుంటేనే మాతృ భాషాభివృద్ధి సాధ్యం. తమిళనాడులో అక్కడి ప్రభుత్వాల చొరవతోనే వారి భాష ప్రాచుర్యం పొందింది.

- ఎం జమున, కవియిత్రి, కావలి

భవిష్యత్‌తరాలకు అమృతం



'మాతృభాష, సంస్కృతి భవిష్యత్ తరాలకు అమృతం... నేడున్న మమ్మీ, డాడీ, ఆంటీ, అంకుల్ సంస్కృతికి చరమ గీతం పాడి, అమ్మానాన్న, అక్కా చెల్లి, అత్తాపిన్ని పదాలను తల్లి ఒడి నుంచే నేర్పించాలి. తెలుగు రాయడం, చదవడం, మాట్లాడడం వల్ల అమ్మభాషకు ఆదరణ పెరుగుతుంది.

- గండికోట సుధీర్‌కుమార్, ఉపాధ్యాయుడు, సాహితీవేత్త, బుచ్చిరెడ్డిపాళెం

మాతృభాషలోనే అన్నీ వ్యవహారాలు ఉండాలి



ప్రస్తుతం తెలుగు మాతృభాష అమలు, నిర్వహణ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆశాజనకంగా లేదు. విదేశాలు తమ మాతృ భాషకు ప్రాధాన్యమిస్తూ ఇతర భాషలను ప్రోత్సహిస్తున్నాయి. ఆ విధానం మన రాష్ట్రంలోనూ అమలు కావాలి. పాఠశాల విద్య నుంచి పరిపాలన, న్యాయ తీర్పులకు మాతృభాషనే ఉపయోగించాలి. గత ప్రభుత్వం పాలనలో మాతృభాష అమలును పట్టించుకోలేదు. తెలుగు భాషను అన్నీ రంగాల్లో అమలు చేసేందుకు తెలుగు భాషోద్యమ సమితిని 2004లో ప్రారంభిం చాము. అప్పటి అధికారులు ఎంతో సహకారం అందించి తెలుగు భాషోద్యమ సమితి నాయకులకు గుర్తింపు కార్డులు కూడా ఇచ్చారు. కలెక్టర్ రవిచంద్ర టేబుల్‌పైకి ఆంగ్ల భాషలో వచ్చిన ఫైళ్లను సంబంధిత శాఖకు తిప్పి పంపించేశారు. మాతృభాష అమలుపై కలెక్టర్ అధ్యక్షతన ప్రతి నెలా సమీక్షా సమావేశాలు నిర్వహిం చేవారు. గత 15 ఏళ్లుగా ఇలాంటి సమావేశాలు జరగడంలేదు. మాతృ భాష పరిరక్షణకు అందరూ కృషి చేయాలి.

- చలంచర్ల భాస్కర్‌రెడ్డి, తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం కీలకం

- ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ శివశంకర్

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు బ్యాంకర్ల సహకారం అత్యంత కీలకమని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఎంఎస్‌ఎంఈడీసీ) చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ అన్నారు. రాష్ట్రంలో కొత్తగా యూనిట్లు నెలకొల్పే యువ పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి సహకరించాలని ఆయన బ్యాంకర్లను కోరారు. గురువారం విజయవాడ ముత్యాలంపాడులోని ఎంఎస్‌ఎంఈడీసీ కార్యాలయంలో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో శివశంకర్ మాట్లాడారు. చదువుకున్న యువతీ యువకులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా రాణించాలని పిలుపునిచ్చారు.

ఎస్జీటీలను 'టెన్త్' విధుల నుంచి మినహాయించాలి

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పబ్లిక్ పరీక్షల ఇన్విజిలేషన్, స్పాట్ డ్యూటీల నుంచి సెకండరీ గ్రేడ్ టీచర్లను మినహాయించాలని ఏపీ ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతి రావు, కాకి ప్రకాష్‌రావు పాఠశాల విద్యాశాఖ అధికారులను కోరారు. రాష్ట్రంలోని ఎక్కువ ప్రాథమిక పాఠశాలల్లో ఒకరిద్దరు మాత్రమే టీచర్లు పనిచేస్తున్నారని, వారికి పరీక్షల డ్యూటీలు వేస్తే బోధనకు ఆటంకం కలుగుతోందని పేర్కొన్నారు.

అసైన్డ్‌ల్యాండా.. ఆక్రమిద్దాం

- ఆర్‌ఆర్.పాలెం సమీపంలో 150ఎకరాల ఆక్రమణ
- ఆక్రమణదారులంతా మొగిలిచెర్ల, నారసింహాపురం భూస్వాములే..
- ఒక్కొక్కరు 10 నుంచి 30ఎకరాల్లో పొగాకు, జామాయిల్ సాగు

లింగసముద్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌ఆర్.పాలెం పంచాయతీ పరిధిలోని కండే వారి ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. ఈ భూములు అటవీ ప్రాంతానికి సమీపంగా ఉండటంతో అడవిలో భూమిని అడిగేదెవరన్నట్టుగా ఉంది వీరి బాగోతం. అందులో యథేచ్ఛగా పంటలు సాగు చేస్తున్నారు. ఆక్రమణదారుల చెర నుండి విడిపించాలని గ్రామస్థులు గత పదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.

● 150ఎకరాల భూముల ఆక్రమణ

గ్రామ సర్వే నంబర్లు 1,3లోని ఈ భూములను అధికారులు విభజించి 275 సర్వే నంబరు కింద 450 ఎకరాలను చేర్చారు. అయితే 1976లో అప్పటి రెవెన్యూ అధికారులు సొసైటీ కింద సుమారు 300ఎకరాలను పలువురికి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చారని కొందరు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ పట్టాలకు సంబంధించిన రికార్డులు లింగసముద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో లేవని అధికారులు చెబుతున్నారు. అయితే మిగిలిన 150ఎకరాల్లో గడిచిన కొన్నేళ్ల నుంచి ఆక్రమణలు జోరందుకున్నాయి. ఈ భూములను మొగిలిచెర్ల, నారసింహాపురంకు చెందిన భూస్వాములు ఒక్కొక్కరు 10 నుండి 30ఎకరాల వరకు ఆక్రమించి పొగాకు, జామాయిల్ సాగు చేస్తున్నట్లు ఆర్‌ఆర్.పాలెం గ్రామస్థులు చెబుతున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఈ భూములను ఆక్రమించిన వారికి అధికారులు డీకేటీ పట్టాలు ఇవ్వాలని జాబితాలు కూడా తయారు చేశారు. కానీ అసైన్‌మెంటు కమిటీ సమావేశం జరగలేదు. దీంతో వీరి ఆశలు నెరవేర లేదు. అయితే ఈ భూములను ఆక్రమించి నకిలీ పట్టాలు, పాస్ పుస్తకాలు సంపాదించిన కొందరికి ఫ్రీహోల్డ్ జరిగినట్టుగా ఆరోపణలు విని పిస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఆర్‌ఆర్.పాలెం కండేవారి బీడు పొలాల్లో సాగు చేసిన జామాయిల్

న్యూస్ బాక్స్

రేపు ఇంటర్ పరీక్షల సిబ్బందికి శిక్షణ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణ సిబ్బందికి శనివారం నెల్లూరులోని డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షల విధుల్లో పాల్గొనే చీఫ్, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ తప్పక హాజరు కావాలని సూచించారు. సిబ్బంది అందరూ పరీక్ష కేంద్రాలను పరిశీలించి సమస్యలుంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఏపీపీగా రఫీమాలిక్



నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 20 : నెల్లూరు ఒకటవ అదనపు జిల్లా కోర్టుకు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది షేక్ రఫీ మాలిక్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసింది. ఆయన పదవీ కాలం మూడేళ్లని, నెలకు రూ.40 వేల గౌరవ వేతనం లభిస్తుందని ఉత్త ర్వుల్లో పేర్కొంది. రఫీ మాలిక్ గతంలో 4వ అదనపు జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేసిన కాలంలో కుక్కపల్లి వెంకటేశ్వర్లు అనే కరుడుగట్టిన నిందితుడికి ఉరి శిక్ష వేసే విధంగా ప్రాసిక్యూషన్ తరఫున వాదించారు. తాజాగా ఆయనను మరోసారి ఏపీపీగా నియమించడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

కృష్ణపట్నం భూ ఆక్రమణ కేసు కొట్టివేత

నెల్లూరు (లీగల్), ఫిబ్రవరి 20 : ముత్తుకూరు మండలం కృష్ణపట్నం గ్రామంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణ కేసును కొట్టివేస్తూ నెల్లూరు ఒకటవ తరగతి స్పెషల్ రైల్వే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ పాలమంగళం వినోద్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... కృష్ణపట్నంలో అదే గ్రామానికి చెందిన తొండమనాటి శ్రీధర్ మరో 9 మంది కలసి సర్వే నెం.756లోని ప్రభుత్వ భూమిలో గుంతలు తవ్వుతూ ఆక్రమిస్తున్నారని 2021 జనవరి 26న నాటి వీఆర్వో చింతా అవినాష్ కృష్ణపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు ఆక్రమణలు ఆపే నిమిత్తం అక్కడకు వీఆర్వోలు, పోలీసులు వెళ్లి మాట్లాడినా నిందితులు తవ్వకాలు ఆపలేదని, అధికారుల విధులకు భంగం కలిగించారనేది అభియోగం. అయితే విచారణ కాలంలో నిందితులపై నేరం రుజువు కాకపోవడంతో న్యాయమూర్తి వారిపై కేసు కొట్టివేస్తూ తీర్పు చెప్పారు. నిందితుల తరఫున సీనియర్ న్యాయవాది పీసీ కృష్ణయ్య వాదించారు.

రైలుపట్టాలపై మృతదేహం గుర్తింపు

కావలి రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కళుగోళమ్మ ఆలయం వెనుక వైపు దిగువమార్గంలోని రైలుపట్టాలపై వ్యక్తి మృతదేహాన్ని గురువారం కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమిచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి వయసు సుమారు 55 నుంచి 60ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహం పడి ఉన్న తీరును బట్టి తెల్లవారుజామున ఆత్మహత్యాయత్నా నికి పాల్పడి గాని, ట్రాక్ దాటుతుండగా రైలు ఢీ కొని మృతిచెంది ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. 5.6 ఎత్తు, ఎరుపు ఛాయతో లైట్ గ్రీన్ కలర్ ఫూల్ హ్యాండ్ షర్టు, బ్లూ, తెలుపు గీతల లుంగి ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాదేవి తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	100
లేయర్ లైవ్	75
స్కిన్ చికెన్	184
స్కిన్‌లెస్	206
లేయర్	127

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8312
వెండి కిలో ధర	రూ. 100,100
వెండి ఒక గ్రాము	రూ.103.10

జనరేటర్ ఉన్నా వృథానే..



స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విద్యుత్ సరఫరాలో అంత రాయం ఏర్పడిన సమయంలో కార్యాలయ పనులకు ఎలాంటి ఆటంకాలు ఉండ కూడదనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన జనరేటర్ నిరుపయోగంగా మారింది. అదీ ఆరు బయట ఎండకు ఎండుతూ, వాన కు తడుస్తూ తుప్పుపట్టి పోతు న్నప్పటికీ కనీసం అధికారులు సైతం జాగ్రత్త చర్యలు తీసుకోక పోవడం దారుణం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జనరేటర్‌ను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి)

ఈ క్రాప్ నమోదుపై నిఘా



ఈ క్రాప్ నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

- క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పరిశీలన
- కౌలు రైతుల వివరాలూ నమోదు

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో ఈ క్రాప్ నమోదులో ఎన్నో అక్రమాలు వెలుగు చూశాయి. క్షేత్రస్థాయి సిబ్బంది నాయకులతో కుమ్మక్కై కర్షకులకు అందాల్సిన ఫలాలను తమ జేబుల్లో నింపుకున్నారు. చివరకు ఫిర్యాదు అందడంతో ఉన్నతాధికారులు సాగు సర్వే నెంబర్లలో ర్యాండమ్‌గా సర్వే చేయడంతో ఈ అక్రమాలు వెలుగు చూశాయి. రెండేళ్ల కిందట జరిగిన ఈ అక్రమాల్లో చాలా మంది క్షేత్రస్థాయి సిబ్బందిపై వేటుకూడా పడింది. అలాంటి పొరపాటు ఈసారి జరగకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 3.5 లక్షల ఎకరాల్లో వరి, 1.5 లక్షల ఎకరాల్లో వేరుశనగ, పత్తి, పొగాకు, మినుము, నువ్వులు తదితర వాణిజ్య పంటలు సాగు చేశారు. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో ఈ క్రాప్ సుమారు 98 శాతం, ఈ కేవైసీ 75 శాతం పూర్తయినట్లు లెక్కలు చెబుతున్నారు. నూరుశాతం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

● ప్రత్యేక యాప్ ద్వారా

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం నుంచి అన్ని రకాల సేవలను అందించేందుకు ప్రణాళికతో ముందుకు వెళుతుంది. అందులో భాగంగా రబీ పంటల వివరాలను నమోదు చేయిస్తోంది. గతంలో కొందరు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా రైతు భరోసా కేంద్రాల్లో ఉంటూ ఫొటోలను మార్చి పెట్టేవారు. కానీ ఇప్పుడు రైతులు పండించే పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారో.. లేదోనని ఉన్నతాధికారులు నిఘా పెడుతున్నారు. ఇందుకోసంగా రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. రబీలో ఈ క్రాప్ నమోదు పూర్తి కావస్తుంది. వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్వోలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల భూమి విస్తీర్ణం, ప్రస్తుతం సాగులో ఉన్న పంటల వివరాలను ఫొటోలతో సహా ఈ క్రాప్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఆ తర్వాత రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ అథెంటికేషన్ (ఈ కేవైసీ) చేయించుకోవాల్సి ఉంటుంది. దీంతో అక్రమాలకు కళ్లెం వేసినట్లయింది.

● ఉన్నతాధికారుల పరిశీలన

ఈ క్రాప్ నమోదులో అక్రమాలకు కళ్లెం వేసేందుకు ఈ కేవైసీ బయోమెట్రిక్ అథెంటికేషన్‌తోపాటు ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జోరుగా సాగుతోంది. మండలస్థాయిలో ఏవో, తహసీల్దారు, ఆర్డీవో, జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులు ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. దీనివల్ల ఎటువంటి అక్రమాలు చోటు చేసుకోకుండా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు పొందే అవకాశం ఉంది.

● కౌలు గుర్తింపు కార్డులు లేకపోయినా..

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోయినా పొలంలో పంటలను సాగు చేస్తుంటే వారి పేరుతోనే వివరాలు నమోదు చేస్తున్నారు. అంతేకాకుండా అనధికార పొలాల్లో (శివాయి భూములు) సాగు చేసి ఉంటే గతంలో ఈ క్రాప్ నమోదు చేసేవారు కాదు. ప్రస్తుతం ఆ సాగు వివరాలనూ ఈ క్రాప్ చేస్తున్నారు. ఇది చాలా మంది వన్ బీ, అడంగల్ లేని రైతులకు ఉపయోగపడనుంది.

నెలాఖరులోగా ఉపాధి వేతనాలు : డ్వామా పీడీ



చెర్లోపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

మనుబోలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలాఖరులోగా ఉపాధి కూలీల వేతనాలను ప్రభుత్వం విడుదల చేస్తుందని జిల్లా నీటియాజ మాన్య సంస్థ (డ్వామా) పీడీ గంగా భవాని తెలిపారు. మండలంలోని చెర్లోపల్లి, కాగితాల పూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల వద్దకు చేరుకుని కూలీలతో మాట్లా డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి వేతనాలు ఆగి ఉన్నాయని, నెలాఖరులోగా విడుదల చేస్తార న్నారు. ఉపాధిలో ఎంతకాలమైనా వేతనాలు ఒకేసారి చెల్లింపు ఉంటుం దని, కాబట్టి కూలీలు ఎక్కువసంఖ్యలో పనులకు రావాలని కోరారు. ఎంతమంది పనికి వచ్చినా వారికి పనికల్పించే బాధ్యతను ఉపాధి సిబ్బంది తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాజమ్మ, టీఏలు గుర్రప్ప, సుప్రజ, ఎఫ్ఏలు వెంకటరమణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందు స్ప్రే చేశాం.. పంట నాశం అయ్యింది!

● ఆదిమూర్తిపురం బాధిత రైతుల ఆవేదన



మందుల డబ్బాలను చూపుతున్న రైతులు

కొండాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగు మందులు అంటకట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదిమూర్తిపురం రైతులు నల్లమోతు తిరుపతిస్వామి, మాధవరపు మాల్యాద్రి, గోపుదేసి మహేష్, దాసరి మహేంద్రలు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వారు విలేకరులతో మాట్లాడారు. సుమారు 500 ఎకరాలలో కందిపంట సాగుచేశామని దానికి సింజెంట కంపెనీ సేల్స్ మేనేజర్ రాజేష్ అనే వ్యక్తి యాంప్లిగో అనే మందు వాడినట్లయితే పురుగులు చనిపోయి పంట బాగుంటుందని తమను కలిశాడన్నారు. అతని మాటలు విని లీటరు రూ.7వేల లెక్కన 70లీటర్లు సుమారు రూ.5లక్షలకు కొనుగోలు చేసి 10రోజులక్రితం పూత, పిందె దశలో ఆయన చెప్పిన మందును స్ప్రే చేశామన్నారు. పురుగులు చనిపోకుండా విపరీతమై పంట నాశనం అయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయా న్ని సేల్స్‌మేనేజర్ రాజేష్ కు తెలియజేస్తే గ్రామానికి వచ్చి పంటను పరిశీలించి న్యాయం చేస్తామని చెప్పి తప్పించుకున్నాడని వాపోయారు. వారంరోజులుగా ఫోన్లు చేసున్నా స్పందించడం లేదన్నారు. ఈ విషయంపై వ్యవసాయశాఖ అధికారులు స్పందించి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు.

పేరుకే 24 గంటల వైద్యశాల

● రోగులకు అందని వైద్యం ● ఎంఎల్‌హెచ్‌పీనే దిక్కు



విధులు నిర్వర్తిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వరికుంటపాడులోని 24 గంటల వైద్యశాల పేరుకే అన్న విమర్శలు ప్రజలు, రోగుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రతినిత్యం అంతంత మా త్రంగా హాజరవుతున్న అక్కడి ఉద్యోగులు గురువారం అస్సలు కనిపించక పోవడంతో వైద్యంచేసే నాథుడే కరువయ్యాడు. మధ్యాహ్నం నుంచి సమీప రామాపురం ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తించాల్సిన ఎంఎల్‌హెచ్‌పీ పవన్‌కు బాధ్యతలు అప్పగించిన అధికారులు, ఉద్యోగులు ఎంచక్కా అటువైపు కన్నెత్తి చూడలేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో తేటతెల్లమవుతోంది. రాత్రి సమయా ల్లోనూ ఇలాంటి తంతే కొనసాగిస్తున్నారని, ఎవరైనా ప్రశ్నిస్తే గ్రామాల్లో ఫీల్డ్ కోసం వెళ్లారంటూ కుంటి సాకులు చెప్ప డం పరిపాటిగా మారిందని రోగులు విమర్శిస్తున్నారు. జిల్లా కేంద్రానికి శివారు మండలం కావడంతో పర్యవేక్షణ ఉండదనే ధీమాతోనే విధుల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగులకు సజావుగా వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పాతకక్షలతో దాడి

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పాతకక్షల నేపథ్యంలో ఐదుగురు కలిసి ఓ వ్యక్తిపై కత్తులు, కర్రలతో దాడి చేసినట్లు సంతపేట పోలీసులు కేసు నమోదు చేవారు. సేకరించిన సమాచారం మేరకు.. నెల్లూరులోని కోటమిట్టకు చెందిన సుల్తాన్ ఎద్దులబండి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రాత్రి వేళల్లో ఎడ్లను పొర్లుకట్టలో కట్టేస్తాడు. సుల్తాన్‌కు జెండావీధికి చెందిన అమీన్, టైలర్స్ కాలనీకి చెందిన అల్లాతో పాతగొడవలున్నాయి. తరచూ వారి మధ్య ఘర్షణలు జరుగుతుండేవి. ఈ క్రమంలో బుధవారం రాత్రి సుల్తాన్ ఎడ్లను చూసేందుకు పొర్లుకట్ట వద్దకు వెళుతుండగా అమీన్, అల్లా మరో ముగ్గురితో కలిసి అడ్డుకున్నారు. కత్తులు, కర్రలతో అతనిపై విచక్షణా రహితంగా దాడిచేసి పారిపోయారు. తీవ్రగాయాలైన సుల్తాన్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గురువారం బాధితుడి ఫిర్యాదుతో సంతపేట ఇన్‌స్పెక్టర్ జీ దశరథరామయ్య హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి అరెస్ట్

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పోస్టులు పెట్టిన దామెర్ల శ్రావణ్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కావలి 1వ పట్టణ పోలీసులు తెలిపారు. విలేకరుల ముసుగులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వంపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు పోస్టులు పెడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు ఉన్నాయని టీడీపీ నాయకుడు మైనంపాటి జైదిద్య ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు.

కోనలో హుండీల ద్వారా రూ.93 లక్షల ఆదాయం



హుండీల లెక్కింపు పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి

రాపూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రం శ్రీపెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. గడిచిన 77 రోజులకు స్వామివారి, అమ్మవారి, ఆంజనేయస్వామి ఆలయాల హుండీల లెక్కింపు ద్వారా మొత్తం రూ.93,28,696, మిక్స్ బంగారు ఆభరణాలు 220.01 గ్రాములు, వెండి ఆభరణాలు 3500 గ్రాములు వచ్చిందని, అలాగే అమెరికా, కువైట్, కత్తర్, ఒమన్, మలేషియా, ఇంగ్లండ్ విదేశీ కరెన్సీ వచ్చిందని ఆలయ కమిటీ తెలిపింది. హుండీల లెక్కింపులో ఉప కమిషనర్, కార్యనిర్వహణ అధికారి, ప్రధాన అర్చకులు, పెంచలకోన ఔట్ పోస్టు పోలీస్, జిల్లా ఎస్‌బీఐ బ్యాంక్ రిటైర్డ్ అసోసియేషన్, నెల్లూరు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్, బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది భ్రమరాంబికా సేవా సమితి బృందం పాల్గొన్నారు. పర్యవేక్షణ నిమిత్తం నెల్లూరు జిల్లా దేవదాయ ధర్మాదాయ శాఖ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్ హాజరయ్యారు. హుండీల ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పెంచలకోన బ్రాంచ్‌కు జమ చేసినట్లు ఆలయ ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపూరు గ్రామానికి చెందిన ముంగ వైభవరెడ్డి (30) తన తల్లితో కలిసి నెల్లూరులో షాపింగ్ చేసుకుని, కారులో తిరిగి వెళుతుండగా బుధవారం రాత్రి పున్నూరు క్రాస్ దగ్గర గుర్తు తెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టారు. ప్రమాదవ శాత్తు జరిగిందని వైభవరెడ్డి కారు దిగి చూస్తుండగా దుండగులు ఒక్కసారిగా మారణాయుధాలతో దాడి చేయబోయారు. దీంతో ఆయన భయంతో పరిగెత్తు వచ్చి కారులో ఎక్కి అద్దాలు లాక్ చేసుకున్నారు. దీంతో దుండగులు మారణాయుధాలతో కారు అద్దాలు పగులగొడుతుండగా అటువైపుగా ద్విచక్ర వాహ నాల్లో కొందరు వస్తుండగా వారిని చూసి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జున రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొంతకాలంగా వైభవరెడ్డి భార్య బిందురెడ్డి మనస్పర్థల కారణంగా వేరుగా ఉంటున్నారు.

సోమశిలలో 61.550 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి గురువారం 1,125 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 61.550 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,800, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. 6వ నెంబరు క్రస్టుగేట్ నుంచి సరఫరా చేస్తున్న జలాలు నిలుపుదల చేశారు. దీంతో నెల్లూరు-సోమశిల రాకపోకలు కొనసాగాయి.

సర్వేపల్లి కాలువలో మహిళ మృతదేహం

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొలగమూడి సమీపంలో ఉన్న సర్వేపల్లి కాలువలో గురువారం సాయంత్రం ఓ మహిళ మృతదేహాన్ని గుర్తిం చారు. పశువుల కాపరులు పశువులను మేపుకుంటూ కాలువ వద్దకు నీటికోసం వెళ్లారు. ఆ సమయంలో నీటిపై తేలాడుతూ కొట్టుకుపోతున్న మహిళ(35) మృతదేహాన్ని గమనించారు. ఈ విషయాన్ని గ్రామంలో తెలియచేశారు. మృతురాలు ఎవరు.. ఎలా చనిపోయింది.. అను అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. పోలీసులకు సమాచారం అందేలోపే మృతదేహం కాలువలో కొట్టుకుపోయింది. దీంతో కాలువ వెంబడి పోలీసులు గాలింపు చేపట్టారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

వెంకటాచలం : పూడిపర్తిలో గురువారం విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. బుచ్చి మండలం దామరమడుగుకి చెందిన దారా శేషాద్రి (25) కరెంటు పని చేస్తుంటాడు. పని కోసం పూడిపర్తి శివార్లలో ఉన్న రొయ్యల గుంతల వద్దకు వెళ్లాడు. అక్కడ విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపో యాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటరత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

● చికిత్స పొందుతూ..

సంగం : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న మౌలాలి మస్తాన్ (27) అలియాస్ మున్నా గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. ఈ నెల 17న ఆత్మకూరుకు చెందిన షేక్ మౌలాలి మస్తాన్ బైక్‌పై నెల్లూరు వెళ్తూ సంగం కొండ మీద అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో గాయపడిన మస్తాన్‌ను మొదట నెల్లూరు వైద్యశాలకు, అనంతరం చెన్నై తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నీటిలో మునిగి జాలరి మృతి



కోటయ్య మృతదేహం

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చేపలు పట్టేందుకు వెళ్లి నీటిలో మునిగి ఒకరు మృతి చెందిన ఘటన నెల్లూరులోని స్వర్ణాల చెరువులో గురువారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు... నెల్లూరు రూరల్ మండలం కొత్తూరు అంబాపురంలో కే కోటయ్య(50), కామేశ్వరమ్మ దంపతులు నివసిస్తున్నారు. వారికి ఐదుగురు సంతానం. కోటయ్య నెల్లూరు చెరువులో చేపలు పట్టుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం బారాషహీద్ దర్గా సమీపంలోని చెరువులో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. స్థానికులు గమనించి 112 నెంబరుకు సమాచారం అందించారు. దర్గామిట్ట పోలీసులు అక్కడికి చేరుకుని ఈతగాళ్ల సహకారంతో మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీశారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కోటయ్య భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ రమేష్‌బాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

హైరిస్క్ గర్భిణులకు తక్షణ వైద్యం అందించాలి

నెల్లూరు (వైద్యం) : జిల్లాలో హైరిస్క్ గర్భిణులను వెంటనే గుర్తించి వారికి తక్షణం మెరుగైన వైద్య చికిత్సలు అందేలా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం శిశు మరణాల సబ్ కమిటీ ఆధ్వర్యంలో గత ఏడాది నవంబరు, డిసెంబరులో జరిగిన 9 శిశు మరణాలపై డీఎంహెచ్‌వో చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలని, జేఎస్‌కే, జేఎస్ఎస్‌కే పథకాలు అందేలా చూడాలన్నారు. రక్తహీనత, వైద్యం అందక తల్లీబిడ్డలు మరణిస్తే ఆరోగ్య సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, పీవో డాక్టర్ దయాకర్, డీడీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి..

కావలి రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మద్దూరుపాడుకు చెందిన కొమ్మా శ్రీనివాసులు (41) గురువారం పురుగుమందు మరణించాడు. రూరల్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. స్థానిక రైతుబజార్‌లో కూరగాయల దుకాణం నిర్వహించే ఈయన 2020లో రోడ్డు ప్రమాదంలో గాయపడి సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేసుకుని కోలుకున్నాడు. అప్పటి నుండి శ్రీనివాసులు మానస్థితి సరిలేదు. దీనికితోడు ఇతరుల వద్ద రూ.20వేలు అప్పు తీసుకున్నాడు. వారు అడుగుతండటంతో ఆందోళన చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతన్ని ఏరియా వైద్యశాలకు తలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలక్రిష్ణయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు - పొదలకూరు రహదారిపై ఆమంచర్ల పంచాయతీ సేవాజ్యోతి కాలనీ వద్ద బుధవారం రాత్రి స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఓజిలి క్రిష్ణ (20) అనే యువకుడు మృతి చెందాడు. ఆమంచర్ల గ్రామానికి చెందిన క్రిష్ణ స్కూటర్‌పై వెళుతుండగా ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడ ని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని రూరల్ సీఐ గుంజి వేణు గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు గైర్హాజరు

వెంకటాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం జరిగిన డిగ్రీ ఒకటవ, నాలుగవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ సీహెచ్ వెంకట్రాయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 230 మందికిగానూ 228 మంది హాజరయ్యారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

అద్దె ఇళ్లలో అంగన్‌వాడీ కేంద్రాలు

- నెలల తరబడి బాడుగ కోసం నిరీక్షణ
- కష్టంగా కేంద్రాల నిర్వహణ
- పూర్తకాని మంజూరైన భవనాలు
- జూన్ నాటికి సర్దుబాటు: సీడీపీవో

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సొంతభవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మండలంలో 77అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. అందులో 72ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు. అలగాయపాలెం,చిల్లకుంట, చినిగేవారిపాలెం, కుమ్మరి పాలెం, జీవీఆర్ ఎస్టీ కాలనీల్లో ఐదు మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 36అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలుండగా, 28కేంద్రాలు అద్దె భవనాల్లోనే నడుస్తున్నాయి. మరో 13 కేంద్రాలకు అద్దె చెల్లింపులు లేకుండా స్థానిక పాఠశాలలు, దాతల సహకారంతో నడుపుతున్నారు. ప్రభుత్వం బడ్జెట్ ప్రకారం మూడు నెలలకు ఓసారి అద్దె చెల్లిస్తారు. అప్పటివరకు అంగన్‌వాడీ కార్యకర్తలే సొంతనిధులతో అద్దె చెల్లిస్తారు. వసతులను బట్టి ఒక్కో సెంటర్‌కు రూ.2వేల వరకు రెంట్ చెల్లించే వెసులుబాటు ఉంది. ఏ క్షణమైనా ఖాళీ చేయమని ఇంటి యజమాని ఆదేశిస్తే, మరో అద్దె ఇంటి కోసం కార్య కర్త, ఆయా గాలింపు చేపట్టాల్సిం దే. ఎవరికి అద్దె భవనాన్ని చూసుకొని కేంద్రాన్ని నడపాలి. మండలం కేంద్రంలో అదెకు ఇళ్లు దొరకని పరిస్థితి. ఒకవేళ ఇల్లు రెంట్‌కు ఇచ్చి నా అద్దె రూ.2000 పైనే ఉండటంతో కార్యకర్తలకు చేతిచమురు వదులుతోంది.

● ముందుకు సాగని నిర్మాణాలు


అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద మండలంలో రూ.15లక్షలతో రెండు అంగన్‌వాడీ భవనాలు మంజూరు అయ్యాయి. బద్దిపూడి, ఉలవపాడు గ్రామాల్లోని ఈ అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు లెంటల్ వరకు చేపట్టారు. అప్పటినుంచి నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదని స్థానికులు వాపోతున్నారు.

● జూన్ నాటికి సర్దుబాటు

జూన్‌నాటికి సొంత భవనాల్లేని కేంద్రాలను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో కలుపుతారని ఉలవ పాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అరుణ తెలిపారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలకు 120రోజులపాటు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు జరగనున్నాయని, ప్రీ స్కూల్ నిర్వ హణపై అవగాహన కల్పిస్తున్నామని ఆమె వివరించారు.


ఉలవపాడు ఎస్సీ కాలనీలో అద్దె భవనంలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

న్యూస్ బాక్స్

సర్వేకు సహకరించాలి

కావలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక సంఘం లోని వార్డు కార్యదర్శులు ఇంటింటి పీఎస్-4 సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేలో పాల్గొనక పోయినా, అధికారులకు సహకరించి అడిగిన సమాచారం ఇవ్వకపోయినా సంక్షేమపథకాలకు అనర్హులయ్యే ప్రమాదం ఉందని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పోషక విలువలు కలిగిన పౌష్టికాహారంతోనే ఆరోగ్యం అని ఐసీడీఎస్ సీడీపీఓ శర్మిష్ట తెలిపారు. మండలకేంద్రంలోని హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. ప్రీ స్కూల్ పిల్లలకు ఆటపాటలతో విద్య నందించాలని తెలిపారు. ఎంఈఓలు రవికుమార్, మల్లికార్జునరావు, సూపర్‌వైజర్ సునీత, డిఆర్‌పిలు జనార్దన్, సుకన్య పాల్గొన్నారు.

తహసీల్దారుకు వినతి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రజాసంఘాల నాయకులు గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అంద జేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమార్, చెన్నకేశవులు, మాధవ రావు, నాగార్జున వీరభద్రయ్య పాల్గొన్నారు.

వ్యాధుల సర్వే పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వీరారెడ్డిపల్లి ఎస్సీ కాలనీ, ఉదయగిరి పట్టణం కంసాలి వీధుల్లో జరుగుతున్న వ్యాధుల సర్వేను గురువారం గండిపాళెం పీహెచ్‌సీ ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మహిళల్లో వచ్చే వివిధ రకాల క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలోఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు పథకాలపై ప్రచారం

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు అమలు చేస్తున్న పలు సేవింగ్ పథకాలపై స్థానిక బ్యాంకు మేనేజర్ శివ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

చేపల గుంటల ఏర్పాటుపై ఫిర్యాదు

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తరుణవాయి పొలాల్లో కొందరు అనధికారికంగా చేపలు గుంటలు ఏర్పాటు చేయడంపై సమీప పొలాల రైతుల అభ్యంతరం వ్యక్తం చేస్తూ గురువారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. చేపల గుంటల వల్ల వరి సాగుచేసే పొలాల్లో ఊట నీరు బయటకు వెళ్లకుండా ముంపునకు గురవుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశీలించి అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న చేపల గుంటలను తొలగించాలని కోరారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

ఉదయగిరి, ఫిబ్రవరి 20: మండలంలోని గుడినరవ రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండల వ్యవసాయ అధికారి ఆంజనేయుల నాయక్, కొట్టాలపల్లి సొసైటీ సీఈవో పోలయ్య పరిశీలించారు. ప్రభుత్వ మద్దతు ధర గ్రేడ్-ఏ రకం క్వింటా రూ.2,320, సాధారణ రకం క్వింటా రూ.2,300 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

రూ.65 వేలకు పోలేరమ్మ చీరల వేలం

అల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ ఆలయం వద్ద గురువారం నిర్వహించిన అమ్మవారి చీరల వేలంలో ఆలయానికి రూ.65,850ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో చిట్టిబాబు తెలిపారు. చైర్మన్ మేడా రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో భకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఇటీవల భక్తులు సమర్పించిన చీరలను ఈ విధంగా భక్తులకు చెందజేయాలనే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

కాలువపైకి వచ్చారని ఇనుపమెట్ల తొలగింపు


ఇనుప మెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

కావలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఉదయగిరి ఆర్వోబీ వంతెనకు ఎదురుగా తుమ్మలపెంట రోడ్డు ప్రవేశమార్గంలోని ఇంటి మిద్దెకు వేసిన ఇనుప మెట్లను గురువారం మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగింపజేశారు. గతంలో నిర్మాణాలు జరుగుతున్నపుడు మెట్లను రోడ్డుపైకి రాకుండా చూసుకోవాలని చెప్పామని అధి కారులు తెలిపారు. అయితే ఆ నిర్మాణం జరిగి చాలా రోజులకు ఇప్పు డు తొలగించటం వెనుక ఆంతర్యమేమిటనేది చర్చ నీయాంశమైంది.

మరమ్మతులు చేపట్టిన గదుల ప్రారంభం

బిట్రగుంట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):విశ్వనాథరావుపేట జడ్పీ హెచ్‌ఎస్ బాలుర పాఠశాలలోని శిథిలావస్థకు చేరిన ఐదు తరగతి గదులను అమరాబచ్చు ట్రస్ట్ నిధులతో మరమ్మతులు చేయించారు. గురువారం ఈ గదులను ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ ఠాగూర్, గంగాధర్‌రావు, మేనేజింగ్ ట్రస్ట్ బచ్చుకృష్ణకుమార్, సంధ్యా దంపతులు పరిశీలించి ప్రారంభించారు. దివంగత బచ్చుఅమరక్క ఆశయ సాధనే ధ్యేయంగా ట్రస్ట్ ద్వారా సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు జి.మంజుల, ఎంఈవోలు నరసింహరావు, జయమ్మ, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరావు, ప్రసన్నుడి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్‌మాల్యాద్రి, విశ్రాంత ఇంజినీరు గోపీకృష్ణ, సాయిసేవకులు ఉన్నారు.

జ్ఞానసంపద అందించేది గురువులే..

కావలి టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులకు అపార జ్ఞాన సంపద అందించేది గురవులే అని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ తెలిపారు. గురువారం స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను అళహరి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శానం కృష్ణ, అధ్యక్షుడు నాగసుధాకర్, తిరుమలశెట్టి లక్ష్మీ, రామారావు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అళహరి సుధాకర్, టీచర్లు

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

- జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. గురువారం స్థానిక డీఆర్‌డీఏ (వెలుగు) కార్యాలయంలో ఎంపీపీ కె పద్మావతమ్మ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 2024-25 ఏడాది పంచాయతీరాజ్ శాఖకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 12పనులకు రూ.50.6లక్షలు, జడ్పీ నిధుల నుంచి 8పనులకు 29 లక్షలు మంజూరు చేశామన్నారు. వీటిలో కొన్ని పనులు పూర్తిచేయగా మరికొన్ని పనులు చేయలేదన్నారు. మార్చి నెలాఖరులోపు పూర్తిచేయకపోతే నిధులు మురిగిపోయే అవకాశం ఉందని, చేపట్టని పనులను రద్దు చేసి కొత్త పనులకు ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. పీఆర్ ఏఈ రామయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి మొదటివిడతగా రూ. 1.54 కోట్లతో సిమెంట్ రోడ్లు పూర్తిచేసినట్లు, రెండవ విడత మరో రెండు కోట్లు మంజూరవగా అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం ట్రాన్స్‌కో ఏఈ పీఎం సూర్యఘర్ సోలార్ విద్యుత్ కనెక్షన్లపై వివరించారు. ఆర్‌డబ్ల్యుఎస్ రవితేజ తాగునీటి పథకాల గురించి వివరించారు. వెలుగు, ఉపాధి, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య, పశుసంవర్థక, రెవెన్యూ, ఐసీడీయస్, విద్యాశాఖ అధికారులు శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షాలెట్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

విద్యార్థులు కష్టపడి చదివి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ సూచించారు. గురువారం ఆమె స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విజయదీపిక పుస్తకాలు అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీపీ పద్మావతమ్మ, జడ్పీటీసీ లక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దశదినకర్మలో ఎంపీ వేమిరెడ్డి దంపతులు

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కరేడు టీడీపీ సీనియర్ నాయకులు నల్లపురెడ్డి శ్యామ్‌గోపాల్ రెడ్డి మాతృమూర్తి ప్రభావతమ్మ దశదిన కర్మ గురువారం జరిగింది. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రభావతమ్మ చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేమిరెడ్డి దంపతులను కలిసి మర్యాదపూర్వకంగా పలకరించారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ వేమిరెడ్డి దంపతులు

జాతీయ వెటరన్ క్రీడాకారుడు భాస్కరరావుకు నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జాతీయ వెటరన్ క్రీడాకారుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు గూడల భాస్కరరావు చిత్రపటానికి గురువారం ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అపస్ జిల్లా నాయకులు గూడల ప్రతాప్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వెటరన్ క్రీడాకారులు, రాజకీయ ప్రముఖులు పాల్గొని నివాళులర్పించారు.

అధిక చార్జీలు వసూలుచేస్తే చర్యలు

- మోటారు వాహన తనిఖీ అధికారులు కరుణాకరన్, లక్ష్మీబాయి

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల నుంచి ఆటోవాలాలు అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కావలి అసిస్టెంట్ మోటార్ వాహన తనిఖీ అధికారులు కె.కరుణాకరన్, బీ.లక్ష్మీబాయి హెచ్చరించారు. ఆటో వాలాలు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో గురువారం వారు ఉదయగిరి పట్టణంలో 167-బీజీ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తున్న ఆటోలు, లైసెన్సు, సరైన పత్రాలు, టాక్సీ చెల్లించని ఇతర వాహనాలకు జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వాహనాల పత్రాలను పరిశీలిస్తున్న మోటారు వాహన తనిఖీ అధికారులు

దివ్యాంగులకు అన్నదానం


దివ్యాంగ చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న టీడీపీ మహిళాకార్యకర్తలు

కందుకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య జన్మదిన వేడుకలను గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. స్థానిక టీడీపీ కా ర్యాలయంలో మహిళావిభాగం ఆధ్వర్యంలో కేకు కట్‌చేశారు. అనంతరం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో జిల్లా టెలికాం అడ్వయిజరీ బోర్డుమెంబరు గుర్రం మాల్యాద్రి, వడ్లమూడి సురేష్‌ల ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. మహిళా కమిటీ సభ్యులు కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలో కేకు కట్ చేసి దివ్యాంగ చిన్నారు లకు మధ్యాహ్నభోజనం ఏర్పాటు చేశారు. అలాగే 24వ వార్డుకు చెందిన మధిర బ్రహ్మరూప్, మణికంఠ, బ్రహ్మతేజ, మనోహర్, కాలేషాలు పట్టణంలోని యాచకులు, అభాగ్యులకు ఆహారప్యాకెట్లు పంచిపెట్టారు. కార్యక్రమాల్లో దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, ముచ్చు శ్రీను, భవనాసి వెంక టేశ్వర్లు, ముచ్చు లక్ష్మీరాజ్యం, కల్లూరి శైలజ, ద్రాక్షాయణి, అశ్విని, ఎస్తేరమ్మ, మయూరి, రత్తమ్మ, శిరీష, శ్రీలత, పార్వతి పాల్గొన్నారు.

ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం

కందుకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి సంపత్ కుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొని చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది పోకూరి కోటయ్య, లోక్ అదాలత్ సిబ్బంది కోటేశ్వరమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విప్రోకు 24మంది ఎంపిక

కందుకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో విప్రో కంపెనీ రెండురోజులగా నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఫైనలియర్ విద్యార్థులు 24మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కంచర్ల రామయ్య గురువారం ప్రకటనలో తెలిపారు.

గుర్తింపు సంఖ్య కార్డు ఉండాలి

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న పీఎం కిసాన్ పరిహారం రైతుల ఖాతాలకు జమ అవ్వాలంటే విశిష్ట గుర్తింపు సంఖ్య కార్డు తప్పనిసరిగా ఉండాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి తిరుమల జ్యోతి తెలిపారు. గురవారం ఆమె రైతుసేవా కేంద్రాల్లో చేపడుతున్న గుర్తింపు నమోదు ప్రక్రియను పరిశీలించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఉలవపాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న విజయవాడ మాకినేని బసవపున్నయ్య ఎంటీకే భవన్‌లో జరగనున్న సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ రెండు పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు ఆర్.మోహన్ పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అఖిలభారత రైతుకూలి సంఘం జిల్లా కోశాధికారి సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సంగం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తరుణవాయి రైతు సేవా కేంద్రంలో గురువారం సంగం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. పీఏసీఎస్ కార్యదర్శి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర క ల్పి ంచేందుకు కేంద్రాలను ఏర్పాటు చేశామ ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్తబుట్టల పంపిణీ

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శకునాలపల్లి పంచాయతీలో గురువారం సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ కరీముల్లాలు ప్రతి ఇంటికీ చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ గ్రామాన్ని శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీసీ కార్పోరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఎంపీడీవో వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 42 యూనిట్లకు 260మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో హాజరైన 138మంది ధృవీకరణ పత్రాలను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి, గండిపాళెం, నర్రవాడ, చాకలికొండ గ్రామాల బ్యాంకు మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేష్, శోభన్‌బాబు, నాగలక్ష్మి, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

● కొండాపురం: కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మౌఖిక పరీక్షలు ముగిశాయి. ఎంపీడీవో ఆదినారాయణ మాట్లాడారు. 45యూనిట్లకు 216 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో కొందరు ఇంటర్వ్యూలకు హాజరుకాలేదన్నారు. కార్యక్రమంలో ఏఓ శేషసాయి, జూనియర్ అసిస్టెంటు నారాయణ, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

● బిట్రగుంట: మండల కార్యాలయంలో ఎంపీడీవో సుబ్రమణ్యం ఆధ్వర్యంలో రాయితీ రుణాల ఇంటర్వ్యూలకు 153 మంది హాజరైయ్యారు. ఐవోబీ బ్యాంక్ మేనేజర్ ప్రమోద్‌కుమార్, యూబీఐఎన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, సహాయక మేనేజర్ జోసెఫ్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ 41, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ గోపి, కెనరా బ్యాంక్ సహాయక మేనేజర్ సుబ్రహ్మణ్యంలు దరఖాస్తుదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు.

● వలేటివారిపాలెం: మండల కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 105 మంది హాజరైనట్లు ఎంపీడీఓ నరేంద్రదేవ్ తెలిపారు. 30 యూనిట్లకు 130 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, స్టేట్ బ్యాంక్ ఫీల్డ్‌ఆఫీసర్ చరణ్‌తేజ, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

జలదంకి: ఎంపీడీవో బ్రహ్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం మండల కార్యాలయంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. దరఖాస్తుదారులు ఒరిజినల్ పత్రాలతో రావాలని తెలిపారు.

అల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనరు ఉమామహేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు ఒరిజినల్ ప్రతాలతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎస్‌బీఐ, కెనరాబ్యాంకు, ఏపీజీబీ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంకు, ఇస్కపల్లి కెనరాబ్యాంకు మేనేజర్ల సమక్షంలో ఎంపిక జరుగుతుందన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

● కందుకూరు: సబ్సిడీ రుణాల కోసం ఓబీఎంఎంఎస్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రుణ మంజూరుకు బ్యాంకర్లు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో లోన్‌మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ అనూష ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రెండుసెట్లు నకలు తీసుకరావాలన్నారు.

అక్రమ కనెక్షన్ల క్రమబద్ధీకరణ సర్వేకు ఆదేశం

కావలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని అక్రమ కొళాయి కనెక్షన్‌లను క్రమబద్ధీకరించేందుకు సచివాలయాల వారీగా సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ప్రస్తుతం పట్టణంలో 25వేలకు పైన నివాసాలుండగా కేవలం 6,100కొళాయి కనెక్షన్లు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అయితే పట్టణంలో సుమారు వెయ్యికి పైగా అక్రమ కనెక్షన్లు ఉన్నట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. వాటిని క్రమబద్ధీకరణకు రాజకీయాలు అడ్డువస్తున్నాయి. ప్రస్తుతం ఇంకా పెరిగే అవకాశం ఉంది. అయితే అమృత్‌పథకంలో భాగంగా ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇవ్వాలనే నిబంధనలో భాగంగా దీంతో సచివాలయాల వారీగా కొళాయి కనెక్షన్‌లు ఉన్న ఇళ్లు, లేని ఇళ్ల గుర్తించేందుకు సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేలో అక్రమ కొళాయి కనెక్షన్‌లు గుర్తించేందుకు అవకాశం ఉన్నందున ఇకనైనా వాటిని క్రమబద్ధీకరిస్తారా లేక రాజకీయనాయకుల ఒత్తిడిలకు తలొగ్గి సర్దుకుంటారా అనేది సర్వత్రా చర్చనీయాంశమైంది.

రూ.6లక్షల పరికరాలు, సైకిళ్ల పంపిణీ

కందుకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కార్యక్రమంలో భాగంగా గురువారం స్టేట్ బ్యాంక్‌ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజరు రాజేష్‌కుమార్ పటేల్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు రూ.6లక్షల విలువైన పరికరాలు, లింగసముద్రం మండలం పెంట్రాల యూపీ స్కూల్ విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీఐ రీజనల్ మేనేజరు సూర్య ప్రకాష్, శ్రీనివాసనాయక్, హెచ్‌ఎం ద్వారాకామయి పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి సర్టిఫికెట్లతో భవిష్యత్తు

అల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి సర్టిఫికెట్లతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి రవీంద్రనాథ్ తెలిపారు. విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్థానిక పేట జడ్పీ పాఠశాలలో నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజేశ్వరి, అబ్జర్వర్ నరసయ్య, వై.శ్రీనివాసులు, ఎస్.మల్లికార్జున, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, డిఆర్పీలు కె.శ్రీకాంత్, పి.నరసయ్య పాల్గొన్నారు.

నిధులు కేటాయింపునకు ఒత్తిడి తేవాలి

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో మెట్ట ప్రాంతాల్లో నిర్మితమవుతున్న జలాశయాలకు నిధులు కేటాయించేలా ఈప్రాంత ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య కోరారు. గురువారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో సీతారాంసాగర్ సాధన సమితి, రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నిధుల లేమితో వెలుగొండ, పెద్దిరెడ్డిపల్లి, సీ తారాంసాగర్ జలాశయాల పనులు దశాబ్దాలు కొనసాగుతున్నా యన్నారు. ఎంపీటీసీ కాకు విజయమ్మ, జేవీవీ నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, కోడె రమణయ్య, బాలగురవయ్య పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీల చించివేత

ఉదయగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆనకట్ట వైఎస్ఆర్ సర్కిల్, ముఖద్వారం వద్ద ఏర్పాటుచేసిన టీడీపీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చింపివేశారు. పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్యలు నూతన సంవత్సర, సంక్రాంతి శుభా కాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. వాటిని చించి వేయడాన్ని గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

గిరిజన భాషాదినోత్సవం

అనంతసాగరం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి):చిలకలమర్రి ఉన్నత పాఠశాలలో గురువారం గిరిజన భాషా దినోత్సవం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావులేకుండా భూముల రీ సర్వే : కలెక్టర్

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు భూముల రీసర్వేను పూర్తి చేయాలని కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. మండలంలోని ముదివర్తిపాలెంలో గురువారం రీసర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించి, రైతులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలోనూ ఓ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. రీసర్వే ఎస్‌వోపీ (ప్రాజెక్టు ఆపరేషన్ ప్రొసీజర్స్)ను వీఆర్‌వోలు, సర్వేయర్లు క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, రీ సర్వే చేస్తే ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండదని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రీసర్వే జరుగుతుందన్నారు. కోర్టు వివాదాలు, కుటుంబ తగాదాలు తప్ప మిగిలినవి పరిష్కారమవుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఏడీ నాగశేఖర్, డీఏవో సత్యనారాయణరెడ్డి, తహసీల్దారు కృష్ణప్రసాద్, ఆర్ఎస్ డీటీ శివప్రసాద్, ఎస్. నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



భూముల రీసర్వేపై రైతులతో చర్చిస్తున్న కలెక్టర్ ఆనంద్

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి : బీజేపీ

పొదలకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద అధికారుల వైఖరికి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు ఈనెల 15లోగా 300 రైతు సేవా కేంద్రాలను అందుబాటులోకి తెస్తామని ప్రకటించారని, 100 కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదన్నారు. ప్రారంభమైన కేంద్రాల్లో గోతాల సరఫరా కూడా లేదన్నారు. కార్యక్రమంలో అయోధ్య రామయ్య, రాచపూడి ధనుంజయరావు, చింతగింజల సుబ్రహ్మణ్యం, రవీంద్రబాబు, కామంచి వెంకయ్య, ముని సురేష్, ఓబులేసు, వేణుగోపాల్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కందమూరు, సజ్జాపురంలో అభివృద్ధి పనులు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందమూరు, సజ్జాపురం గ్రామాల్లో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గురువారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రాష్ట్రంలో రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని, ప్రజలకు సమస్యలు లేకుండా రూ.కోట్లు వెచ్చించి అన్నీ ప్రాంతాల్లో పనులు చేపట్టినట్లు తెలిపారు. కాగా, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి మండలంలోని కాకుపల్లిలో రెండవ రోజు గడప గడప కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కల్లూరుపల్లి వద్ద నిర్మాణంలో ఉన్న రహదారి పనులను కమిషనర్ సూర్యతేజతోకలిసి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి

రూ.2వేలతో రూ.40లక్షల ప్రమాద బీమా

పొదలకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని (పీఏఐ) మరింత విస్తరించిందని, ఏడాదికి రూ.2వేల ప్రీమియంతో రూ.40లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నదని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ పీఎస్.రాజు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రీమియం రూ.100 చెల్లిస్తే రూ.2లక్షలు, రూ.500లకు రూ.10లక్షలు, రూ.వెయ్యికి రూ.20లక్షలు, గరిష్ఠంగా రూ.2వేలకు రూ.40లక్షలు బీమా పొందవచ్చని వివరించారు. ఆసక్తి కలిగిన ఖాతాదారులు బ్యాంకు అధికారులను సంప్రదించాలని కోరారు.

● మనుబోలు, (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని (పీఏఐ) మరింత విస్తరించినట్లు మనుబోలు బీఎం సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏడాదికి రూ. 2వేలు ప్రీమియంతో రూ. 40లక్షల ప్రమాదబీమా కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలి : సీపీఎం

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశానికి ఏ మాత్రం ఉపయోగకరంగా లేని కేంద్ర బడ్జెట్‌ను సవరించి మరోసారి ప్రవేశపెట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నెల్లూరు రూరల్ తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పార్టీ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, తిరుపాలు మాట్లాడుతూ బడ్జెట్‌లో శ్రామిక రంగాలకు అన్యాయం జరిగిందన్నారు. పేద, నిరుపేదలకు భరోసా ఇచ్చే పథకాలుగానీ, ఏపీకి ప్రత్యేక హోదా ప్రస్తావనగానీ లేవని విమర్శించారు. విశాఖ ఉక్కుకు ఐరన్ ఓర్ కేటాయించకపోవడం ఆందోళనకరమని తెలిపారు. పేదలకు, సంపన్న వర్గాలకు ఒకే విధమైన జీఎస్టీని విధించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, ప్రభాకర్, ఆదిశేషయ్య, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి అవకాశాలు

వెంకటాచలం, (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో గురువారం 'సమర్థమైన ఉపాధి మార్గాల కోసం కొత్త మార్గాలు, గ్రామీణ వృత్తులను విస్తరించడం' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలతో గ్రామీణ వృత్తులను విస్తరించేందుకు ప్రతి విద్యార్థి ఆలోచనల్లో మార్పు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమారెడ్డి, ఐఐటీటీఎం నోడల్ ఆఫీసర్ సంజీవ్‌రెడ్డి, మెప్మా పీడీ రాధమ్మ, డీఆర్‌డీఏ పీడీ నాగరాజ కుమారి, డాక్టర్ ఎం త్యాగరాజు, డాక్టర్ పీ సుజాత, ప్రొఫెసర్ జవహర్ బాబు, డాక్టర్ నీలమణికంఠ, ఎం విక్రమ్‌కుమార్ పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి శిక్షణ సందర్శన

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి 20: (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లి జడ్పీ హైస్కూల్లో గురువారం జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలతో శిక్షణ గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఫణీంద్ర, ఆర్‌పీఎస్ ఎం. విజయ్‌కుమార్, ఉమ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్లకు శిక్షణ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సర్వీస్ ప్రొవైడర్లకు జీవనోపాధి కల్పించడంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో గురువారం బ్యూటీషియన్, ఎలక్ట్రీషియన్ పనులకు సంబంధించి 15రోజుల శిక్షణ ప్రారంభమైంది. యూత్ ఆఫ్ టర్న్ వారి ద్వారా ఏర్పాటు చేసిన ఈ శిక్షణను మెప్మా పీడీ రాధమ్మ ప్రారంభించారు. ప్రస్తుత సమాజంలో బ్యూటీషియన్లు, ఎలక్ట్రీషియన్లకు డిమాండ్ ఉందన్నారు. శిక్షణను వినియోగించుకుని మంచి ఉపాధిని పొందాలన్నారు. శిక్షణ అనంతరం మెప్మా ద్వారా సర్టిఫికెట్ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఈలు, సీఎంఎంలు పాల్గొన్నారు.

అర్హతలు ఉంటేనే రుణాలు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : వివిధ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలకు అర్హత కలిగిన వారినే సిఫార్సు చేస్తామని నెల్లూరు ఎంపీడీవో శైలేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో రుణ దరఖాస్తులను బ్యాంకు అధికారులతో కలిసి పరిశీలించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 225 రుణాలకు దరఖాస్తులు రాగా 181 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారని తెలిపారు.

12వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలి

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 12వ పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం టౌన్‌హాలులో ఆ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కరువు భృతి బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించాలని, ఈహెచ్ఎస్ కొత్త కార్డులు జారీ చేయాలని, ఈహెచ్ఎస్ కార్డులపై రీయింబర్స్‌మెంట్‌ను రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘానికి నగరంలోని జూబ్లీ వైద్యశాల ప్రాంగణంలో భవంతిని కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు.

నేడు కాకుటూరుకు సోమిరెడ్డి రాక

వెంకటాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరుకి శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రానున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 గంటలకు గ్రామంలో జరిగే సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొంటారని తెలిపింది.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

వెంకటాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని గురువారం జడ్పీ డిప్యూటీ సీఈవో, నోడల్ ఆఫీసర్ జే మోహన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం వెంకటాచలంలో జరుగుతున్న పీ4 సర్వేను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో కల్పన తదితరులు ఉన్నారు

శ్మశాన దారికి మరమ్మతులు

విడవలూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని దండిగుంటలో గురువారం స్థానిక టీడీపీ నాయకులు కుడుముల మల్లికార్జున సొంత నిధులతో శ్మశానానికి వెళ్లే దారికి మరమ్మతులు చేయించారు. శ్మశానికి వెళ్లే దారి కొన్ని నెలలుగా ముళ్లకంపలు, పొదలతో నిండిపోయింది. ఎవరైనా చనిపోతే మృతదేహన్ని తీసుకుని పోయేందుకు స్థానికులు ఇబ్బందులు పడాల్సివచ్చేది. దీన్ని గమనించిన మల్లికార్జున సొంత నిధులతో ఎక్స్‌కవేటర్‌తో దారిని శుభ్రం చేయించారు.

రేపు చలో కలెక్టరేట్

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి20:(ఆంధ్రజ్యోతి): ధాన్యానికి కనీస మద్దతు ధర లభించకపోవడంపై శనివారం చలో కలెక్టరేట్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు తెలిపారు. గురువారం బాపనపాడు నుంచి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో పుత్తేటి మల్లికార్జున,కోరికల బుజ్జయ్య, వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరమడుగు జడ్పీ హైస్కూల్‌లో గురువారం నెల్లూరు నారాయణ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 50మందికి దంత వైద్య చికిత్సలు చేశారు.

రోడ్డు ఆక్రమణల పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెన్నూరురోడ్డులో ఆక్రమణలను గురువారం డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళితో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా వ్యాపారులతో మాట్లాడారు. ఆటోలు ఇక్కడికి రాకుండా త్వరలో ప్రత్యేక సిబ్బందితో ట్రాఫిక్ కంట్రోలు చేస్తామని తెలిపారు. ఆయన వెంట సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వేమిరెడ్డి దంపతులతో డిప్యూటీ మేయర్ భేటీ

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా ఇటీవల ఎన్నికైన సయ్యద్ తహసీన్ గురువారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ఆశీస్సులందుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, తహసీన్ భర్త ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం నేదురుమల్లికి నివాళి

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇందిరాభవన్‌లో మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి జయంతిని గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో జనార్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సురేష్‌బాబు, అల్లాఉద్దీన్, ముదిగొండ శ్రీనివాసులు, గణేష్, సుబ్బారావ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంతో ఆగిన ఇళ్ల నిర్మాణాలు

● విద్యుత్ తీగల అడ్డు తొలగించని అధికారులు

● గృహ లబ్ధిదారులకు ఇక్కట్లు

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ అధికారులు, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో జగనన్న ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇక్కట్లు పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో బుచ్చి నగర పంచాయతీలోని మంగలికట్ట ప్రాంతంలో లేఅవుట్-2ను ఏర్పాటు చేశారు. అక్కడ గుర్నాథం యానాదమ్మ, బూదూరు వెంకటమ్మతోపాటు మరికొంతమంది పేదలకు నివేశనా స్థలాలు, ఇళ్లు మంజూరుచేశారు. రెండేళ్లుగా పలువురు లబ్ధిదారులు రూఫ్ లెవల్ వరకు ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే ఆ ఇళ్లపై విద్యుత్ తీగలు అడ్డుగా ఉండడంతో శ్లాబు నిర్మాణాలను ఆపేశారు. తొలగిస్తామన్న అధికారులు తొలగించనేలేదు. దీంతో శ్లాబు పోసుకోలేక ఇక్కట్లు పడుతున్నారు. మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే ఇల్లూలేదు..బిల్లూ రాదనే ఆందోళనలో ఉన్నారు. ఈ విషయంపై తహసీల్దారు ఏ. వెంకటేశ్వర్లును వివరణ కోరగా, సమస్యను పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. కమిషనర్ మాత్రం కౌన్సిల్‌లో తీర్మానం చేసి తొలగిస్తామన్నారు.



మంగలికట్టలోని లేఅవుట్‌లో విద్యుత్ తీగలను తొలగించక, ఆగిన ఇళ్ల నిర్మాణం

నిర్మాణాన్ని ఆపేశాం...



విద్యుత్ తీగలు తొలగించకపోవడంతో శ్లాబు వరకు నిర్మించుకున్న ఇంటిని ఆపేశాం. అయినా అధికారులకు కనికరం కలగలేదు. వచ్చే నెలలోపు శ్లాబు వేయకుంటే బిల్లు రాదంటున్నారు. ఇక ఇంటిపై ఆశలు వదులుకోవాల్సిందే. నిలువ నీడలేక కాలువకట్ట పైనే ఉన్నాం.

-గుర్నాథం యానాదమ్మ

వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట : ప్రశాంతిరెడ్డి

కోవూరు, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్వీర్యమైన వ్యవసాయరంగం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తున్నదని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. కోవూరు పంచాయతీలోని పడుగుపాడులో గురువారం ఆమె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) భవనాన్ని ప్రారంభించారు.అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రభుత్వం కల్పించే రాయితీలను రైతులకు చేర్చే వారధి సహకార సంఘమని తెలిపారు. రైతులంతా సహకార సంఘం సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అధికారి గుర్రప్ప, తహసీల్దారు నిర్మలానందబాబ, టీడీపీ నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జెట్టి రాజ గోపాల్‌రెడ్డి, ఇంతా మల్లారెడ్డి, కాటంరెడ్డి కృష్ణారెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ భవన ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

25 నుంచి స్వర్ణలింగేశ్వరుడి శివరాత్రి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నెల్లూరు చెరువు గణేష్ ఘాట్ వద్ద ఉన్న స్వర్ణలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. స్వర్ణ భారత్ ట్రస్ట్, విక్రమ సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు, కార్యదర్శి పీ సురేందర్‌రెడ్డి, ముక్కాల వ్యాస్‌ప్రసాద్, సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ప్రధాన కార్యదర్శి బయ్యా మల్లిక, కోడూరు జయప్రద తెలిపారు. గురువారం ఆలయం వద్ద వారు మీడియాతో మాట్లాడారు. మూడు రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కామేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుజాత, మహాలక్ష్మి, శ్రీనివాసులు, హర్షవర్ధన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సాహిత్య సభ

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : చేతన సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని వర్ధమాన సమాజంలో శనివారం సాయంత్రం 6.30 గంటలకు తెనాలి రామలింగ కవి - వ్యక్తిత్వం - సాహిత్యంపై సభ జరుగుతుందని సంస్థ కార్యదర్శి వై శేషగిరీశం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాహితీకారులు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, మెట్టు రామచంద్ర ప్రసాద్ హాజరవుతారని, యువత పాల్గొనాలని కోరారు.

సీఆర్‌సీలో సామాజిక న్యాయ దినోత్సవం

వెంకటాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరస్వతినగర్ వద్ద ఉన్న సంయుక్త ప్రాంతీయ కేంద్రం (సీఆర్‌సీ)లో గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సీఆర్‌సీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర డిజేబిలిటీ కమిషనర్ రవి ప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛ, విలువలు, వ్యక్తి గౌరవం, భద్రతా సామాజిక ఆర్థిక పురోభివృద్ధి వంటి ప్రాథమిక అంశాల విషయంలో ఎలాంటి వివక్ష పాటించకుండా సామాజికన్యాయం చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం జిందాల్ పవర్ ప్లాంట్ వారు రూ.2 లక్షలు విలువ చేసే పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో జిందాల్ పవర్ ప్లాంట్ హెడ్ సుల్తాన్ మన్సూరీ, డిజేబుల్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ మహమ్మద్ అయూబ్, చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ సీఈవో సీతారామానాయుడు, ఏవో కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషలో పట్టు సాధించాలి : సమగ్రశిక్ష ఏపీసీ

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు మాతృభాషలో పట్టు సాధించాలని సమగ్రశిక్ష ఏపీసీ డీ వెంకట సుబ్బయ్య సూచించారు. నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో గురువారం భాషోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో భాషోత్సవాల నిర్వహణ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు పద్యాలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఎంఈవోలు తిరుపాలు, మురళీధర్, ఉపాధ్యాయులు హరీష్, కిరణ్, సోమేశ్వరరావు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య

బాలభవన్‌లో మాతృభాషా దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వర విద్యాలయంలో నెల్లూరు బాలభవన్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం జరిగింది. విద్యార్థులకు పద్య పఠనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి మాట్లాడుతూ మూడు నిమిషాల్లో 30 పద్యాలు శ్రావ్యంగా చెప్పిన బాలలను అభినందించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గంగిశెట్టి శివకుమార్, సుబ్బమ్మ, నాగేశ్వరమ్మ, సుందరి, నాగరాజ్, సులోచన తదితరులు పాల్గొన్నారు.

నేడు పప్పులవీధి పాఠశాలలో..

నగరంలోని పప్పులవీధి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం శైలజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరోగ్య సంరక్షణలో నర్సుల పాత్ర కీలకం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రోగుల ఆరోగ్య సంరక్షణలో నర్సుల సేవలు కీలకమని పురపాలకశాఖ మంత్రి నారాయణ సతీమణి పొంగూరు ఇందిర వెల్లడించారు. గురువారం నారాయణ వైద్య కళాశాల ఆడిటోరియంలో నారాయణ నర్సింగ్ కళాశాల వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. నారాయణ నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులను ఉత్తమ సేవకులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. నారాయణ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు అంకిత భావంతో పనిచేసేలా బోధన చేయాలన్నారు. నర్సింగ్ కళాశాల డీన్ డాక్టర్ వనజ కుమారి మాట్లాడుతూ నర్సింగ్ కళాశాల విద్యార్థులు దేశంలోనే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేత్రపర్వం శ్రీనివాస ఉదయాస్తమాన సేవలు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని నిప్పో ఫ్యాక్టరీ ఆవరణలో శ్రీనివాస కల్యాణ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, నివేదిన, శాత్తుమ్మురై, నేత్ర దర్శనం, తిరుప్పావడ సేవ, సాయంత్రం సర్వదర్శనం, ఆలయ శుద్ధి, సహస్ర దీపాలంకరణ, ఊంజల్‌సేవ నేత్రపర్వంగా జరిగాయి. భక్తుల గోవింద నామ స్మరణ మారుమోగింది. పాడుతాతీయగా కార్యక్రమ చిన్నారులు ఆలపించిన భక్తిగీతాలు వీనులవిందు చేశాయి. ఈ ఉత్సవాలను శనివారం వరకు జరగనున్నాయి. శ్రీనివాస కల్యాణ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.

కార్పొరేట్లకు దోచిపెట్టేలా కేంద్ర బడ్జెట్ : వామపక్షాలు

నెల్లూరు (వైద్యం), (ఆంధ్రజ్యోతి) : కేంద్రం బడ్జెట్ కేవలం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేదిలా ఉందని వామపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా గురువారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. గాంధీబొమ్మ నుంచి అంబేడ్కర్ బొమ్మ వరకు ఈ ప్రదర్శన సాగింది. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సామాన్యులకు ఉపయోగపడేదిలా లేదని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ విద్య, వైద్య, గ్రామీణ ఉపాధి హామీ పథకం, వ్యవసాయ రంగాలకు నిధుల కేటాయింపు నామమాత్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు కత్తి శ్రీనివాసులు, మాదాల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు, ఆంజనేయులు, కొండా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లాయపాళెంలో రౌడీల హల్‌చల్

బుచ్చిరెడ్డిపాళెం,ఫిబ్రవరి20(:ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లాయపాళెంలో గురువారం కొంతమంది రౌడీలు హల్‌చల్ చేశారు. దీంతో గ్రామస్థులు భయభ్రాంతులకు గురయ్యారు. చెల్లాయపాళెంకు చెందిన టీడీపీ నాయకుడు తమ్మిరెడ్డి మల్లికార్జున, ఆయన తమ్ముడి మధ్య కొంతకాలంగా భూ వివాదం ఉంది. ఈ క్రమంలో సుమారు రెండేళ్ల క్రితం తమ్ముడు మృతి చెందాడు తరువాత మల్లికార్జునకు ఆయన తమ్ముడి కుటుంబ సభ్యులకు మధ్య పలుమార్లు భూమి విషయమై వివాదాలు జరుగుతుండేవి. తాజాగా గురువారం తమ్ముడి కుటుంబ సభ్యులతో కలిసి 15మంది గుర్తు తెలియని వ్యక్తులు వివాదాస్పద పొలం వద్దకు చేరుకున్నారు. దీంతో మల్లికార్జున 100కి కాల్‌చేసి వారిని పోలీసులకు అప్పగించారు.

వెలుగు కార్యాలయంలో సీసీల ఘర్షణ

తోటపల్లి గూడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో ఇద్దరు సీసీలు గురువారం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సేకరించిన వివరాల మేరకు, విధినిర్వహణలో భాగంగా టీపీ గూడూరు సీసీ తిరుపతమ్మ, సౌత్‌ఆములూరు సీసీ రాజేశ్వరి వెలుగు కార్యాలయానికి వచ్చారు. వచ్చిన కొద్దిసేపటికి ఒకరిపై ఒకరు పెద్దపెద్దగా కేకలు వేసుకుంటూ, ఆవరణలో ఉన్న కర్రలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇంతలో అక్కడ చేరుకున్న కార్యాలయ సిబ్బంది ఇద్దరిని వారించి వివాదం సద్దుమణిగేలా చేశారు. సీసీలు మధ్య వివాదానికి కారణం ఆర్థిక లావాదేవిలా... లేక వ్యక్తిగత కారణాలా.. అనేది తెలియరాలేదు. ఇరువురు సీసీలు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఏపీఎం విజయలక్ష్మిని వివరణ కోరగా, సీసీలు దాడులు చేసుకున్నట్లు ఎలాంటి సమాచారం అందలేదన్నారు.

కుంభమేళాకు అర్చకులు.. భక్తుల పాట్లు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయంలో పలువురు అర్చకులు ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లారు. దీంతో ఆలయంలో ఒకరిద్దరు అర్చకులు మాత్రమే ఉండటంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అర్చన, ఇతర పూజలు చేసేవారు లేకపోవడంతో వచ్చిన వారు వచ్చినట్టే వెనుతిరిగి వెళ్లిపోయారు. మరోవైపు ఇటీవల నైట్ వాచ్‌మన్ మద్యం మత్తులో ఆలయంలోకి రావడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. దీంతో సహచర ఉద్యోగులు వారించగా ఈఓ దగ్గరకే వెళ్తానంటూ సాక్షాత్తు ఈఓ వద్దకే వెళ్ళాడు. ఆయన్ను వారించినా ఈవో వెంట బడటం గమనార్హం.

నేడు కోనకు మంత్రి ఆనం రాక

రాపూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అనంతరం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి కలువాయి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారని పేర్కొంది.

ఇసుక రీచ్‌లో వాహనాల సీజ్

పొదలకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమతులు లేని విరువూరు రీచ్‌లో ఇసుకను తరలిస్తున్న వాహనాలను మైనింగ్ డీడీ సీజ్ చేశారు. గురువారం సూరాయిపాలెం ఇసుక రీచ్‌ను పరిశీలించి, తిరిగి వెళ్లే సమయంలో విరువూరు ఇసుక రీచ్‌కు అనుమతి లేకపోయినా అక్కడి నుంచి ఇసుక లోడ్‌తో వాహనాలు వెళ్లడాన్ని గమనించిన డీడీ బాలాజీ నాయక్ వాటిని సీజ్ చేసి రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించారు.

నేడు అధికారులతో దినకర్ సమీక్ష

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 20 సూత్రాల పథకం చైర్మన్ లంకా దినకర్ శుక్రవారం జిల్లా అధికారులతో సమీక్షించనున్నారు. ఈ సమావేశం ఉదయం 10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుంది. అనంతరం మీడియాతో మాట్లాడతారని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి.

బకాయిలు విడుదల చేయాలి

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆర్థిక బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు జీ రాజమనోహర్ ఓ ప్రకటనలో కోరారు. 12వ పీఆర్‌సీ కమిటీ వేసి నివేదికలు వచ్చేలోగా 30శాతం ఐఆర్ ఇవ్వాలన్నారు. యాప్‌ల భారం తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

మరుగున పడుతున్న మాతృభాషా ప్రాభవం!

- ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు సహా సూచిక బోర్డుల దాకా తెలుగుకు దక్కని ప్రాధాన్యం
- ఒత్తిడి పెట్టని తెలుగు భాషా సంఘాలు

తెలుగు అకాడమీ ఎక్కడ..?

గత ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీ

కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టాలని తెలుగు భాషాభిమానుల విజ్ఞాపన

- 6లో



ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో మాతృభాషకు జనం పట్టం కడుతున్నారు.అందుకు తగ్గట్టే ప్రభుత్వాలూ మద్దతుగా నిలుస్తున్నాయి.అయితే మనవద్దే మాతృభాషా ప్రాభవం మరుగున పడిపోతోంది. కార్యాలయాలు మొదలుకుని వ్యాపార సముదాయాలు, వాహనాల బోర్డుల్లో సైతం తెలుగుకు ప్రాధాన్యత దక్కడం లేదు. అధికార భాషా చట్టం అమలుకు నోచుకోవడం లేదు.స్వచ్ఛందంగా తెలుగు వ్యాప్తికి, అభివృద్ధికి కృషి చేయాల్సిన తెలుగు భాషా సంఘాలూ ఈ విషయంలో ఉదాసీనంగా మారిపోవడం విచారకరం.

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

నేటి నుంచి ముక్కంటీశ్వరాలయంలో

శివరాత్రి ఉత్సవాలు


భక్త కన్నప్ప



భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభం

అంగరంగ వైభవంగా ఏర్పాట్లు


విద్యుత్ కాంతులతో ముక్కంటి ఆలయం


ఆలయంలో పూల అలంకరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహా శివరాత్రి ఉత్సవాలు శుక్రవారం భక్తకన్నప్ప ధ్వజారోహణంతో ప్రారంభంకానున్నాయి. పరమశివుడి వరంతో కన్నప్పగా మారిన తిన్నడికి కొండపై స్థానమిచ్చి, కిందిభాగంలో దేవదేవుడు కొలువైన పుణ్యక్షేత్రమిది. దీంతో భక్తుడు కన్నప్పకు తొలిపూజ చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయడం ఆనవాయితీగా వస్తోంది. 14 రోజులు జరిగే శివరాత్రి ఉత్సవాల్లో ప్రథమంగా కన్నప్ప ధ్వజారోహణం జరగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ అలంకార మండపం నుంచి భక్తకన్నప్ప ఉత్సవమూర్తిని కొండపైకి ఊరేగింపుగా తీసుకువెళ్తారు. అక్కడ వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, శాస్త్రోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం మహాక్రతువును నిర్వహించి దేవతలకు ఆహ్వానం పలుకుతారు. ఈ క్రమంలో కొండ, చుట్టుపక్కల ప్రాంతాల్లో విద్యుత్ దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంటోంది.

ఆకట్టుకుంటున్న అలంకరణలు

భవుడి మహా శివరాత్రి ఉత్సవాలకు శ్రీకాళహస్తి సర్వాంగసుందరంగా ముస్తాబైంది. ప్రధాన ఆలయాన్ని విద్యుత్ దీపాలతో, రంగ వల్లులతో అలంకరించారు. గోపురాలకు కొత్త రంగులద్దడంతో. కళకళలాడుతున్నాయి. భక్తకన్నప్ప, రామసేతు వంతెన, పట్టణవ్యాప్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో చలువపందిళ్లు ఏర్పాటు చేశారు. చతుర్మాడ వీధులు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికైన ధూర్జటి కళా ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. సన్నిధి వీధిలో కైలాసం సెట్టింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. రథాలు, నారద పుష్కరిణిలోని తెప్పలను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి చేతులమీదుగా వీటిని ప్రారంభించనున్నారు.


ధూర్జటి కళా ప్రాంగణం

ఉత్సవాల్లో నేడు...

- తెల్లవారుజామున 4:30 గంటలకు మంగళ వాయిద్యాలు
- ఉదయం 5గంటలకు గోపూజ, సుప్రభాతం, సర్వదర్శనం
- 6 గంటలకు ప్రథమ కాలాభిషేకం
- 7 గంటలకు ద్వితీయ కాలాభిషేకం
- 8 గంటలకు పరివార దేవతలకు నైవేద్యం, నిత్యోత్సవం
- 10 గంటలకు ఉచ్చికాలాభిషేకం
- మధ్యాహ్నం 3 గంటలకు కన్నప్ప కొండకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల తరలింపు
- సాయంత్రం 4 గంటలకు భక్తకన్నప్ప ధ్వజారోహణం
- 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- 6 గంటలకు భక్తకన్నప్ప గ్రామోత్సవం
- 7 గంటలకు భక్తకన్నప్ప ఆలయ ప్రవేశం, స్వామి అమ్మవార్లకు ధూపదీప, నైవేద్యం, మంత్రపుష్ప సమర్పణ
- రాత్రి 8 గంటలకు మత్స్యగ్రహణం, అంకురార్పణ, వాస్తు శాంతి
- రాత్రి 9 గంటలకు పళ్లియర పూజ, స్వామి దర్శనం ముగింపు

డిప్యూటీ మేయర్‌గా మునికృష్ణ ప్రమాణస్వీకారం

- సెనేట్ హాలుకు సైకిల్‌పై వచ్చిన ఆర్సీ



తిరుపతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా ఆర్సీ మునికృష్ణ ప్రమాణ స్వీకారం గురువారం అట్టహాసంగా జరిగింది. ఇటీవల జరిగిన డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ మౌర్య నేతృత్వంలో డిప్యూటీ మేయర్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి ముందు కూటమి నాయకులతో కలిసి టౌన్‌క్లబ్ సర్కిల్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. తెలుగు మహిళలు హారతులతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి జ్యోతిరావ్ పూలే విగ్రహం, ఎస్వీయూ ప్రధాన గేటు ఎదురుగా గల అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. అక్కడి నుంచి సైకిల్‌పై ఎస్వీయూ సెనేట్ హాలుకు చేరుకుని డిప్యూటీ మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. కార్పొరేటర్లను కలుపుకుని నగరాభివృద్ధికి శ్రమిస్తానని చెప్పారు. తనను అభ్యర్థిగా నియమించిన కూటమి నాయకత్వానికి, ఓట్లు వేసిన కార్పొరేటర్లకు, గెలుపునకు కృషిచేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆయనను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, నాయకులు బీఎల్ సంజయ్, జేబీ శ్రీనివాస్, ఊకా విజయకుమార్, శ్రీధర్ వర్మ, పుష్పావతి, దంపూరి భాస్కర్, ఊట్ల సురేంద్ర నాయుడు, మన్నెం శ్రీనివాసుల నాయుడు, చినబాబు, మహేష్ యాదవ్, పాటకం వెంకటేష్, కృష్ణ యాదవ్, సుబ్బు యాదవ్ పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.


మునికృష్ణతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న మేయర్ శిరీష, చిత్రంలో ఎమ్మెల్యే ఆరణి


సమావేశం జరుపుతున్న డిప్యూటీ స్పీకర్ ముద్ర నారాయణ

కౌన్సిల్ భేటీలో హైడ్రామా!

- అధికారులు అవమానించారన్న మేయర్ శిరీష
- క్షమాపణలు చెప్పిన కమిషనర్, అధికారులు
- సంతృప్తి చెందలేనంటూ శిరీష బాయ్‌కాట్
- డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అధ్యక్షతన సాగిన కౌన్సిల్ సమావేశం

తిరుపతి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి) : 'డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో ఓ భవనం కూల్చివేతకు వెళ్లిన తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ప్రవర్తించిన తీరు నన్ను బాధించింది. వారి మీద ఎలాంటి చర్యలు తీసుకుంటారో కమిషనర్ చెప్పాలి. ఆ తర్వాతే కౌన్సిల్ సమావేశం కొనసాగుతుంది' అంటూ మేయర్ డాక్టర్ శిరీష డిమాండ్ చేశారు.

'ఆ భవనం కార్పొరేటర్ శేఖర్ రెడ్డి పేరుతో లేదు. అది పూర్తిగా అక్రమ కట్టడం. నిబంధనల మేరకే అధికారులం అక్కడకు వెళ్లాం. విధుల్లో భాగంగా తగిన గౌరవ, మర్యాదలు ఇవ్వలేకపోయివుంటే క్షమాపణలు చెబుతున్నా' అని డీసీపీ మహాపాత్ర చెప్పారు. అయితే డీసీపీ క్షమాపణలకు తాను సంతృప్తి చెందలేదని, ఎలాంటి చర్యలు తీసుకుంటారో చెప్పాలని కమిషనర్‌ను మేయర్ అడిగారు. 'వాళ్ల తరఫున నేను కూడా క్షమాపణ చెబుతున్నా. వాళ్లకు మెమో ఇచ్చి చర్యలు తీసుకుంటాం.'

ఇంతలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జోక్యం చేసుకుని మేయర్‌కు తగిన గుర్తింపు ఇవ్వని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారని, సభను సజావుగా సాగేలా చూడాలని సూచించారు. తనకు సరైన వివరణ అందలేదని మేయర్ బాయ్‌కట్ చేసి సభనుంచి వెళ్లిపోయారు. సుమారు 10 మంది కార్పొరేటర్లు ఆమెవెంట వెళ్లిపోయారు. ఇలా గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో హైడ్రామా నడిచింది.


బయటకు వెళ్లిపోతున్న శిరీష

మేయర్‌పై మండిపాటు

నాలుగేళ్ల పాలనలో మేయర్‌కు తగిన గౌరవం ఇవ్వకుండా మౌనంగా కూర్చోబెట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదని ఎమ్మెల్యేతోపాటు పలువురు కార్పొరేటర్లు మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెకు గౌరవంతో పాటు తగిన స్వేచ్ఛ ఇచ్చామన్నారు. మేయర్ స్థానంలో ఉండి అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడానికి వెళ్లడమే పెద్ద తప్పు అని, అయినప్పటికీ సభా ముఖంగా కమిషనర్‌తో పాటు డీసీపీ క్షమాపణలు చెప్పిన తర్వాత లేచివెళ్లిపోవడం సభ్యత కాదన్నారు.

● మేయర్‌గా ముద్రనారాయణకు బాధ్యతలు

అవుట్ సోర్సింగ్ సిబ్బందికి జీతభత్యాలు, పారిశుధ్యానికి సంబంధించిన కీలక అజెండా అంశాలపై చర్చించాల్సి ఉండడంతో కౌన్సిల్ సమావేశం జరగాలని కార్పొరేటర్లు పట్టుపడ్డారు. సభలో 15 మంది సభ్యులు ఉంటే కౌన్సిల్ జరుపుకోవచ్చన్న నిబంధన ఉండడంతో కమిషనర్ మౌర్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ అనుమతితో ఇద్దరు డిప్యూటీ మేయర్లలో సీనియర్‌గా ఉండే ముద్ర నారాయణకు సభ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్సీ మునికృష్ణ ప్రతిపాదించగా, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బలపరిచారు. దీంతో సభ సజావుగా సాగింది.

● రూ.271 కోట్ల బడ్జెట్ అంచనాకు ఆమోదం

తిరుపతి నగరపాలక సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ272కోట్లతో సిద్ధం చేసిన బడ్జెట్ అంచనాలకు సభ ఆమోదం తెలిపింది. రెవెన్యూ ఆదాయం రూ.170 కోట్లు, ఖర్చు రూ.116కోట్లు, మూలధన రాబడి రూ.92కోట్లు, ఖర్చు రూ.130 కోట్లకు అంచనా వేశారు. అనంతరం జరిగిన కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో 41 అంశాలపై చర్చ జరపగా ఒక ఉద్యోగికి ప్రమోషన్ ఇచ్చే అంశాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టారు. టేబుల్ అజెండాగా రెండు అంశాలపై చర్చించి ఆమోదం తెలిపారు.

గ్రూప్-2 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశం



తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 23వ తేదీ నుంచి జరగనున్న గ్రూప్-2 మెయిన్స్ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించే 14 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పేపర్-1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల్లోపు చేరుకోవాల్సి ఉంటుందనారు. పేపర్-2కు హాజరయ్యే వారు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల్లోపు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. కావున అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ వాచ్‌లు, వైర్‌లెస్ హెడ్‌సెట్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్ష కేంద్రాల వద్దకు రవాణా సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తొక్కిసలాటపై నేటి నుంచి
రెండవ దశ విచారణ

- హాజరుకానున్న 70మంది -

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో జనవరి 8వ తేదీన వైకుంఠ ద్వార దర్శన టిక్కెట్ల జారీలో జరిగిన తొక్కిసలాట ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో ఏర్పాటు చేసిన విచారణ కమిటీ రెండో దశ విచారణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. మొదటి దశలో భాగంగా ఈనెల 3వ తేదీ వరకు కమిటీ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌చార్జి సీవీఎస్వో మణికంఠ, రుయా, స్విమ్స్‌వైద్యుల నుంచి వివరాలు సేకరించడమేగాక తొక్కిసలాట జరిగిన బైరాగిపట్టెడ పద్మావతి పార్కును పరిశీలించారు. రెండవ దశలో పలువురిని విచారించి వాంగ్మూలం సేకరించనున్నారు. కలెక్టరేట్ వేదికగా ఈ విచారణ సాగనుంది. తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన ఆరుగురి కుటుంబ సభ్యులను, గాయపడిన 46మంది బాధితులను, పద్మావతి పార్కు పరిసరాల దుకాణాల వారిని ఇలా మొత్తం 70మందిని విచారించనున్నారు. వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చారు.


కల్తీ నెయ్యి కేసు నిందితులకు బెయిల్
పిటిషన్‌పై తీర్పు రిజర్వు

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసులో నిందితుల బెయిల్ పిటిషన్‌పై తిరుపతి 2వ ఏడీఎం కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు రిజర్వు చేశారు. ఈనెల 10వ తేదీన రిమాండులో వున్న నలుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారి తరపు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. బెయిల్ పిటిషన్‌పై గురువారం కోర్టులో వాదనలు జరిగాయి.నిందితుల తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది వాణి వాదనలు వినిపించగా సిట్ తరఫున ఏపీపీ జయశేఖర్ వాదించారు. సుదీర్ఘంగా సాగిన వాదనలు విన్న న్యాయమూర్తి పిటిషన్‌పై తీర్పును రిజర్వు చేశారు.వచ్చే సోమవారం లేదా మంగళవారం తీర్పు వెలువరించే అవకాశముంది.

శ్రీవారి ఆలయ పైకప్పుకు మరమ్మతులు

- లీకేజీల నివారణకు మొదలైన పనులు
- ఉచిత సర్వీస్ కింద చేపట్టిన టీవీఎస్

తిరుమల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణ కోసం టీటీడీ పనులు మొదలుపెట్టింది. తిరుమల ఆలయంలో మూలమూర్తి కొలువైన గర్భాలయంతో పాటు పలు మండపాలు, ఉప ఆలయాలు ఉన్నాయి. వీటి నిర్మాణం జరిగి వందల ఏళ్లు కావడంతో ప్రస్తుతం మండపాలు, ఉప ఆలయాల పైకప్పులో చాలా ప్రాంతాల్లో పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో వర్షం కురిసినపుడు నీరు లోనికి ప్రవేశిస్తోంది.ఈ క్రమంలో గతేడాది నవంబరు 18వ తేదీన జరిగిన టీటీడీ బోర్డు సమావేశంలో ఈ సమస్యపై చర్చించి తీర్మానం చేశారు. లీకేజీల నివారణ అంశంలో అనుభవం కలిగిన టీవీఎస్ సంస్థతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ పనులన్నీ ఉచిత సర్వీస్ కింద చేసేందుకు ఆ సంస్థ అంగీకారం తెలిపింది. ఇందులో భాగంగా ఆ సంస్థకు చెందిన సిబ్బంది గురువారం లీకేజీ నివారణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పగుళ్లను గుర్తించి పూడ్చడంతో పాటు పెయింటింగ్ వేస్తున్నారు. మార్చి31వ తేదీన నాటికి మొత్తం లీకేజీలను నివారించేలా ప్రణాళికలు రూపొందించుకున్నారు.


శ్రీవారి ఆలయంలోని రంగనాయక మండపంపై మరమ్మతు పనుల్లో సిబ్బంది



జస్టిస్ ఇందిరా బెనర్జీ



జస్టిస్ భవానీప్రసాద్ - జస్టిస్ రమేష్ - రామసింగ్ - అజయ్ జైన్ - వీజే సన్నీ - సత్యశ్రీ

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ భవానీప్రసాద్, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ రమేష్, ఏపీ ఈఆర్సీ చైర్మన్ టీ రామసింగ్, ఏపీ టూరిజం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, సినీ నటులు వీజే సన్నీ, సత్యశ్రీ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

27న ఖాళీ డబ్బాల విక్రయానికి సీల్డ్ టెండర్ల ఆహ్వానం

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో నెయ్యి, నూనె, జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ డబ్బాల విక్రయానికి టీటీడీ సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తోంది. టెండర్ పొందిన భక్తులు ఖాళీ డబ్బాలను 2026 మార్చి 31వ తేదీ వరకు సేకరించవచ్చు. తిరుపతి హరేరామ హరేకృష్ణ రోడ్డులో ఉన్న మార్కెటింగ్ (వేలం) కార్యాలయంలో సీల్డ్ టెండర్లు ఈనెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయాలి. ఇతర సమాచారం కోసం మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877 2264429ను సంప్రదించవచ్చు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీహరి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.48 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 72,745

తలనీలాలు సమర్పించినవారు : 24,156



కామాక్షి సమేత పాండురంగేశ్వర స్వామి ఆలయం

మన శివాలయాలు

పులికాట్ జనం ఆరాధ్యదైవం

పంట్రంగేశ్వరుడు

సముద్రతీరంలో, పులికాట్ సరస్సు అంచున వాకాడు మండలంలో ఉంది అత్యంత పురాతనమైన కామాక్షిదేవి సమేత పాండురంగేశ్వర స్వామి శివాలయం. పులికాట్ మీద ఆధారపడిన ప్రజల ఆరాధ్య దైవం పంట్రంగేశ్వరుడు. రెండు శివలింగాలున్న ఈ ఆలయం దాదాపుగా ఒక దీవిలో ఉంటుంది. పులికాట్ తీర గ్రామాలకు, దీవుల్లోని ప్రజలకు పంట్రంగేశ్వరుడు ఆరాధ్య దైవం. రాకపోకలకు సౌకర్యవంతమైన దారులు లేకపోవడంతో భక్తుల ఆదరణ తగ్గిపోయింది. అత్యంత పవిత్రమైన ఈ పురాతన ఆలయాన్ని సందర్శించడం మాత్రం గొప్ప అనుభవం.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

చరిత్ర: చోళుల కాలంలో 11వ శతాబ్దంలో నిర్మించిన ఆలయంగా చారిత్రక ఆధారాలున్నాయి. తూర్పుచాళుక్యరాజు, గుణక విజయదిత్యుని సేనాని పంట్రాంగుడు నిర్మించినట్లు శాసనాధారాలు తెలుపుతున్నాయి. సునామీతో కొన్ని వందల ఏళ్ల కిందట ఇసుక మేటలో అంతర్ధానం అయిపోయిన ఈ ఆలయాన్ని 1841లో పునరుద్ధరించినట్లు చెబుతారు. ఇంకా ముందు గొప్ప నౌకాకేంద్రంగానూ, వాణిజ్య పట్టణంగానూ పంట్రంగం ఉండేదని తెలుస్తోంది. శ్రీకృష్ణదేవరాయలు కూడా పంట్రంగం దగ్గరలో ఉన్న పూడిరాయదొరువు గ్రామంలోని దీవులలోకి వచ్చి విడిదిచేసి వెళ్తుండేవాడని అంటారు.

పురాణ ప్రాశస్త్యం: రెండు శివలింగాలున్న పంట్రంగం ఆలయంకు సంబంధించి ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. శ్రీరామచంద్రుడు రోజూ ఇక్కడికి పూజకు వచ్చే సమయానికి అంజనేయస్వామి ఆయన కోసం ఇసుకతో ఒక శివలింగాన్ని తయారు చేసి సిద్ధంగా ఉంచేవాడు. ఒకరోజు ఎందు చేతనో ఆంజనేయస్వామి ఆలస్యంగా ఈ దీవికి చేరుకున్నాడు. శ్రీరామచంద్రుడు తనే ఒక శివలింగాన్ని తయారు చేసి పూజ పూర్తి చేసేశాడు. రామ భక్తుడైన హనుమకు కోపం వచ్చింది.ఆ మాత్రం ఆగలేక పోయావా అని అలిగాడు. తన భక్తుడిని శాంతపరిచి, ఆంజనేయుడు చేసిన సైకత శివలింగాన్ని కూడా పక్కనే ప్రతిష్టించి శ్రీరాముడు పూజ చేశాడు. దీంతో రెండు శివలింగాలున్న ఆలయంగా పంట్రంగం ప్రసిద్ధి చెందింది. శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన శివలింగాన్ని పాండురంగేశ్వరస్వామి అని, శ్రీ ఆంజనేయస్వామి ఇసుకతో ప్రతిష్ఠించిన శివలింగాన్ని రామలింగేశ్వరస్వామిగా పిలుస్తారు.



శ్రీరామచంద్రుడు ప్రతిష్ఠించిన పాండురంగేశ్వరస్వామి



ఆంజనేయస్వామి ఇసుకతో ప్రతిష్ఠించిన రామలింగేశ్వరస్వామి

విశేషాలు: ఒకే ఆలయంలో రెండు శివలింగాలు కలిగి ఉండటం పంట్రాంగం ప్రత్యేకత. ఆలయం ప్రాంగణంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, మరో వైపు కామాక్షిదేవి, భైరవుడి ఆలయాలు ఉంటాయి. పరిసర ప్రాంతాలలో 101 శివలింగాలు, 101 కొలనులు దర్శనమిస్తాయి. దూపదీప నైవేద్యాల కొరకు పలువురు దాతలు 890 ఎకరాల భూమి పంట్రాంగం ఆలయానికి ఇచ్చినట్టు ఆధారాలున్నాయి. సాధారణ రోజుల్లో ఒకటీ అరా మాత్రమే భక్తులు సందర్శిస్తారు. శివరాత్రికి మాత్రం పోటెత్తి వస్తారు. సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు పట్టణాల నుంచే కాక, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచీ కూడా భక్తులు వస్తారు.

శివరాత్రి ప్రత్యేకం: ఈ నెల 26 బుధవారం మహాశివరాత్రి మహోత్సవాలకు ఆలయం సిద్ధం అవుతోంది. కమిటీ నిర్వాహకుడు టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించేందుకు ఆలయాన్ని సిద్ధం చేస్తున్నారు.ఉదయాన్నే గణపతిపూజలో ప్రారంభమై మహాన్యాశ రుద్రాభిషేకం జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి ప్రతి రెండు గంటలకోసారి పాలాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 12 గంటలకు లింగద్భోవ పాలాభిషేకం, నైవేద్యం, విశిష్ఠ అలంకరణ జరుగుతాయి.తెల్లవారుజామున 2 గంటలకు కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. 4 గంటలకు వినాయకుడు, కామాక్షి అమ్మవారు, శివ పార్వతుల ఊరేగింపు ఉంటుంది.



ఆలయ గోడలపై కనుమరుగవుతున్న పురాతన శాసనాలు

ఇలా వెళ్లాలి...

- నాయుడుపేట నుంచి మల్లాం మీదుగా 48 కిలోమీటర్లు దూరం ఉంటుంది. మల్లాం తరువాత రోడ్డు గుంతలమయంగా ఉంటుంది.
- గూడూరు నుంచి కోట మీదుగా మల్లాం చేరుకుని పంట్రంగంకి వెళ్లచ్చు. ఇది కూడా 48 కిలోమీటర్లు దూరం ఉంటుంది.
- పులికాట్ సరస్సులోంచి నడచి వెళ్లే దారి ఒకటుంది. సూళ్లూరుపేట నుంచి 25 కిలోమీటర్లు ప్రయాణిస్తే పేర్నాడుకి చేరుకోవచ్చు. అక్కడి నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో తోటకట్ల గ్రామం ఉంటుంది. అటకానితిప్ప ఇక్కడి దాకా మట్టి రోడ్డు మాత్రమే ఉంటుంది. జీపులు, బైకులు వెళ్తాయి. తోటకట్ల నుంచి పులికాట్ సరస్సులో దిగి 4 కిలోమీటర్లు నడిస్తే పంట్రంగం చేరుకోవచ్చు. వలస పక్షులను చూస్తూ ఈ దారిలో ప్రయాణించవచ్చు. ప్రస్తుతం పులికాట్‌లో నీళ్లు లేవు. బైకులు, ట్రాక్టర్లు వెళ్తాయి. సముద్రం పోటెక్కితే నీళ్లు వస్తాయి. మోకాటి లోతు నీళ్లలోనే నడవాల్సి ఉంటుంది.

పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నూతన పరిశ్రమల స్థాపనకు, యువతకు మెరుగైన ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎంఈజీపీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి లబ్ధిదారుల నుంచి అందిన 1,278 దరఖాస్తులకుగాను 541 యూనిట్లు మంజూరు చేయగా 516 గ్రౌండింగ్ అయ్యాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్ దరఖాస్తులను కూడా వేగంగా పరిష్కరించాలన్నారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 2,109 పరిశ్రమలకు గాను 2,077కు అనుమతులిచ్చామని, మరో 22 పరిశీలనలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా ఇన్‌చార్జి పరిశ్రమల శాఖ అధికారి మారుతీప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నడికుడి-శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైనుకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పీఎంజీ ప్రాజెక్టు పనుల పురోగతిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, కేంద్ర రైల్వేశాఖ ఉన్నతాధికారులు కలెక్టర్లు, జేసీలతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ హాజరయ్యారు. నడికుడి-శ్రీకాళహస్తి మధ్య రైల్వేలైన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పట్టా, డీకేటీ భూములకు సంబంధించిన అవార్డు పాసింగ్ పూర్తి చేశామని కలెక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. సంబంధిత బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్‌కు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో భూసేకరణ డీటీ భాస్కర్ పాల్గొన్నారు.

పర్యాటక రంగాభివృద్ధికి చర్యలు తీసుకోండి



స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటక, ఆతిథ్య రంగాభివృద్ధికి వనరులు పుష్కలంగా ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన పర్యాటక, ఆతిథ్య రంగాల అభివృద్ధిపై సమీక్షించారు. టూరిజం కార్పొరేషన్ పనితీరుపై సమీక్షించారు. స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి పురోగతి సరిగా లేదని, దాని నిర్వహణ కోసం జేసీని అడ్మినిస్ట్రేటర్‌గా ఏర్పాటు చేశామని కలెక్టర్ వివరించారు. తిరుపతి, తిరుమలలో గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్, టీటీడీ సౌజన్యంతో అరకు కాఫీ యూనిట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు సుద్దాల అశోక్ 'శ్రమ కావ్యగానం'


తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ 'శ్రమ కావ్య గానం' కార్యక్రమం శుక్రవారం తిరుపతిలో నిర్వహించనున్నారు. సమాజంలో శ్రమ ప్రాముఖ్యతను వివరిస్తూ అశోక్‌తేజ రాసిన పాటల పుస్తకంలోని పాటలను ఈ సందర్భంగా రాగయుక్తంగా పాడి వినిపించనున్నారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 5గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని సీఐటీయూ నేత కందారపు మురళి తెలిపారు.

కిరణ్‌రాయల్ నుంచి ప్రాణహాని

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన లక్ష్మి

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్ రాయల్‌పై ఇటీవల పలు ఆరోపణలు చేసిన లక్ష్మి గురువారం మరోసారి ఆయనపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఫిర్యాదు చేశారు. కిరణ్‌రాయల్ నుంచి తనకు ప్రాణహాని ఉందని, ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని వివరించారు. కిరణ్‌రాయల్‌పై తాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సెక్షన్లు నమోదు చేయలేదని, ఆయన్ను వెంటనే అరెస్టు చేసి, న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మరుగున పడుతున్న మాతృభాషా ప్రాభవం!



- గత ప్రభుత్వ హయాంలో అమలు కాని హామీ
- కూటమి ప్రభుత్వమైనా చర్యలు చేపట్టేనా?

ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు సహా సూచిక బోర్డుల దాకా తెలుగుకు పెద్దగా దక్కని ప్రాధాన్యం

ఒత్తిడి పెట్టని తెలుగు భాషా సంఘాలు

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

తిరుపతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఇంటా బయటా చెవులకింపుగా, కంటికి నిండుగా వినిపించి కనిపించిన మాతృభాషా ప్రాభవం క్రమేపీ మరుగున పడిపోతోంది. 2012డిసెంబరు చివరి వారంలో ప్రపంచ తెలుగు మహాసభలను తిరుపతిలో నిర్వహించిన సమయంలో ఆ స్ఫూర్తితో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొంత మేరకు తెలుగు భాషకు, తెలుగు సాంప్రదాయాలకు ప్రాధాన్యత లభించింది. అప్పట్లో చిత్తూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సహా అధికారులు, ఉద్యోగులు ప్రతి సోమవారం తెల్ల పంచె, తెల్ల చొక్కా, కండువా ధరించి విధులకు హాజరయ్యే వారు. ఫైళ్ళు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరిపేందుకు ప్రయత్నాలు జరిగాయి. అప్పట్లో పాకాల కోర్టులో న్యాయమూర్తి తెలుగులో తీర్పు ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా అందరికీ ఆదర్శంగా నిలిచారు. అయితే క్రమేపీ ఆ స్ఫూర్తి లోపించింది. దానికనుగుణంగా తెలుగు భాష వినియోగం మరుగున పడగా ఇపుడు ఫైళ్ళు, రికార్డులన్నీ దాదాపు ఇంగ్లీషులోనే సాగుతున్నాయి. ఇ-ఫైళ్ళ పేరిట ఇపుడు ఉత్తరప్రత్యుత్తరాలలో ఇంగ్లీష్ వాడకం మరింతగా పెరిగిందనే చెప్పాలి. అధికారిక సమీక్షల్లో జిల్లా అభివృద్ధిని, వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పేరిట ఇంగ్లీషులోనే ప్రదర్శిస్తున్నారు. అధికార భాషా సంఘం నామమాత్రావశిష్టంగా మారింది. పర్యటనలూ లేవు, సమీక్షలు అంతకన్నా లేవు.



తిరుపతి గోశాలలోని తెలుగు అకాడమీ తాత్కాలిక భవనం



టీటీడీ జలప్రసాదంపైనా ఆంగ్లమే

తెలుగును తోసిరాజని ఆంగ్లానికి పట్టం

దేశంలోనే పేరుమోసిన పర్యాటక కేంద్రం, పుణ్యక్షేత్రమైన తిరుపతిలోనే తెలుగుకు ప్రాముఖ్యత దక్కకపోవడం భాషాభిమానులకు ఆవేదన కలిగిస్తోంది. పలు ప్రధాన కూడళ్ళలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డుల్లో ఇంగ్లీషు తప్ప తెలుగు కనిపించడం లేదు. దేశ విదేశాల నుంచీ వచ్చే యాత్రికుల కోసం వేర్వేరు భాషల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం అవసరమే. అదే సమయంలో వాటి సరసన మాతృభాషకూ చోటు దక్కకపోవడమే విమర్శలకు దారి తీస్తోంది. నగరంలో చాలావరకూ దుకాణాలు, వ్యాపార సముదాయాలకు ఇంగ్లీషులోనే నామ ఫలకాలు ఏర్పాటు చేసి వుండడం కనిపిస్తోంది.తమిళనాడు నుంచీ తిరుపతికి వచ్చే అక్కడి ప్రైవేటు,ప్రభుత్వ బస్సులపై తమిళ, ఇంగ్లీషు భాషల్లో బోర్డులు కనిపిస్తుండగా కర్ణాటక నుంచీ తిరుపతి వచ్చే అక్కడి ఆర్టీసీ బస్సులపై కన్నడ, ఇంగ్లీషు భాషల్లో బోర్డులు వుంటున్నాయి. ఈ రెండు రాష్ట్రాల బస్సుల గమ్యస్థానం తిరుపతి అయినప్పటికీ ఆ బస్సుల బోర్డుల్లో తెలుగుకు చోటు దక్కడం లేదు. ఈ రెండు రాష్ట్రాల బస్సులపై రవాణా సంస్థల పేర్లు గానీ, బస్సు సర్వీసుల పేర్లు గానీ తమిళ, కన్నడ భాషల్లోనే స్టిక్కరింగ్ చేయించడం కనిపిస్తోంది. కొన్ని బస్సులపై అదనంగా ఇంగ్లీషు కూడా వుంటోంది. అదే ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల విషయానికొస్తే గమ్యస్థానాల పేర్లు తమిళనాడుకు వెళ్ళేవాటిపై తెలుగు, తమిళంలోనూ, కర్ణాటక వెళ్ళేవాటిపై తెలుగు, కన్నడ భాషల్లోనూ రాయించి ఉదారత చాటుతున్నాయి. ఇది మంచి పద్ధతే కానీ అదే బస్సులపై రవాణా సంస్థ లేదా బస్సు సర్వీసుల పేర్ల విషయానికొస్తే ఎక్కువగా ఇంగ్లీషులోనే స్టిక్కరింగ్ చేయించడం కనిపిస్తోంది. మాతృభాషకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఇరుగు పొరుగు రాష్ట్రాలను చూసి నేర్చుకోవాల్సిన అవసరం వుందని చెప్పాలి.



తిరుపతిలో షాపులపై తెలుగేదీ?





కర్ణాటక, తమిళనాడు బస్సులపై కనిపించని తెలుగు

తెలుగు అకాడమీ ఎక్కడ..?

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఓ వెలుగు వెలిగిన తెలుగు అకాడమీ చిరునామా ఇప్పుడు ఎక్కడ అనేలా పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర విభజన తర్వాత తిరుపతిలో తెలుగు అకాడమీ ఏర్పాటు చేస్తామనే గత వైసీపీ ప్రభుత్వ హామీ పూర్తిస్థాయిలో నెరవేరలేదు. తిరుపతిలోని ఎస్వీ గోశాలలో ఏర్పాటు చేసిన ఓ తాత్కాలిక భవనంలో తెలుగు అకాడమీ కార్యకలాపాలను నామమాత్రంగా కొంత సాగించింది. అయితే, పూర్తి స్థాయిలో సిబ్బంది కానీ, పుస్తక సామాగ్రి కానీ, ముద్రణ వ్యవహారాలు కానీ, పుస్తక క్రయ, విక్రయాలు కానీ తిరుపతి కేంద్రంగా పూర్తి స్థాయిలో సాగించలేదు. దీని ఫలితంగా వందలాది పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వంటి ప్రతిష్టాత్మక సంస్థలు గల తిరుపతిలో అకాడమీ చిరునామా వెతుక్కోవలసిన పరిస్థితి ఏర్పడింది.తిరుపతిలోనే శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేస్తామని గతంలో తెలుగు అకాడమీ ఛైర్‌పర్సన్‌గా పనిచేసిన లక్ష్మీపార్వతి ప్రకటించినా ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడలేదు సరికదా, విజయవాడలోనే తిష్ట వేసిన తెలుగు అకాడమీ కీలక అధికారులను కూడా తిరుపతికి తరలించలేకపోయారు. ముద్రణ వ్యవహారాలన్నీ విజయవాడ కేంద్రంగానే సాగాయి. క్రయ విక్రయాల సంగతి సరేసరి. నేరుగా తెలుగు అకాడమీకి వెళ్ళి ఒక్క పుస్తకం కూడ కొనలేని దౌర్భాగ్యం దాపురించింది. దీంతో సుదీర్ఘ చరిత్ర కల్గిన తెలుగు అకాడమీ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ఇందుకు గత ప్రభుత్వ నిర్వాకమే కారణం. ఇప్పుడు కూటమి ప్రభుత్వమైనా దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సి వుంది.తెలుగు నుంచీ సంస్కృత అకాడమీని వేరు చేయడంతో పాటు తెలుగు అకాడమీకి కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.రాజకీయ ప్రభావం కల్గిన వ్యక్తులకు కాకుండా, భాషా, సాహిత్య రంగాల్లో కృషి చేసిన వారిని గుర్తించి కార్యవర్గంలో చోటు కల్పిస్తే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది.తిరుపతి కేంద్రంగానే శాశ్వత భవనం ఏర్పాటు చేసి పుస్తకాల ముద్రణ, అమ్మకం వంటి కార్యకలాపాలను సాగించాలని,కొత్త తరంలో మాతృభాష, సాహిత్యం పట్ల అభిరుచిని పెంపొందించాలని తెలుగు భాషాభిమానులు కోరుతున్నారు.

తెలుగు భాషా సంఘాల ఉదాసీనత

స్వచ్ఛందంగా తెలుగు వ్యాప్తికి, అభివృద్ధికి సేవలందించాల్సిన తెలుగు భాషా సంఘాల పాత్ర అంతకంతకూ తగ్గిపోతోంది.ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో మాతృభాషకు అక్కడి జనం పట్టం కడుతున్న తీరును కళ్ళారా చూస్తూ కూడా తెలుగు భాషా సంఘాలు ఉదాసీనంగా వుండడం గమనార్హం.ఇప్పటికైనా ఆ సంఘాలు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తెలుగు భాషాభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరముంది.

అక్రమంగా ఇసుక తరలింపు

పట్టించుకోని అధికారులు



అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

ఓజిలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం జోస్యులవారికండ్రిగ నుంచి నిత్యం ఇసుక తరలిపోతోంది. స్వర్ణముఖి నది నుంచి కొందరు అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలోని అత్తివరం, పున్నేపల్లి, ఓజిలి (రేగళ్ల వద్ద), కురుగొండ, మానమాల గ్రామాల పరిధిలో ఉన్న మామిడి కాలువ నుంచి ఇసుక తరలింపునకు అనుమతి ఉంది. అయితే ఈ ప్రాంతంలోని ఇసుక భవన నిర్మాణాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడక పోవడంతో స్వర్ణముఖి నుంచి తవ్వి తరలిస్తున్నారు. ఉచిత ఇసుక విధానం మాటున కొందరు సెజ్‌లలో పరిశ్రమలకు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి, పగలు తేడాలేకుండా స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నా రెవెన్యూ, పోలీసు, గనుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

నాగేశ్వరస్వామి ఆలయ ఉత్సవ కమిటీ నియామకం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వెలసిన గంగా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26 నుంచి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్సవాల నిర్వహణకు 7 మంది సభ్యులతో కమిటీని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం నియమించారు. అధ్యక్షుడిగా ముప్పాళ్ల శ్రీహరిరెడ్డి, సభ్యులుగా నలజాం రాము, మాముడూరు శాంతి, మాటిరెడ్డి సాయికిరణ్, పట్టుపల్లి రాజశేఖర్, చెన్న శ్రీనివాసులు, తాటిపర్తి ఆదినారాయణరెడ్డిని నియమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, కె.శ్రీధర్, కాళంగి ప్రభాకర్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ వామపక్షాల ధర్నా



టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద గురువారం వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ పేదలను పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు కనీస మద్దతు ధర దక్కడం లేదని, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించే దిశగా చర్యలు చేపడుతుందన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు శివకుమార్, ప్రభాకర్, శశికుమార్, కాలేషా, రమేష్, సునీల్, చంద్రయ్య, వెంకటయ్య, మణి, శ్రీనివాసులు, ప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాల నాయకుల నిరసన

గూడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎల్ఐసీలో ఖాళీగా ఉన్న 3,4 క్యాడర్ ఉద్యోగాల నియామకాలను చేపట్టాలని ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నాయకులు అన్నారు. గురువారం స్థానిక కార్యాలయం వద్ద ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత కొన్నేళ్లుగా 3,4 క్యాడర్లకు సంబంధించి ఉద్యోగ నియామకాలు చేపట్టలేదన్నారు. ఎల్ఐసీలో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి, శాశ్వత నియామకాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, మనోజ్ కుమార్, నాగరాజు, అశోక్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టండి

దొరవారిసత్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి సర్పంచులు, కార్యదర్శులతో చర్చించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాలరెడ్డి, ఎంపీడీవో గోవర్ధన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

తడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. తడ రైల్వేస్టేషన్‌కు సమీపంలోని అనపగుంట గ్రామానికి వెళ్లే దారిలోని రైల్వే గేటు వద్ద సుమారు 25నుంచి 30 సంవత్సరాల వ్యక్తి గురువారం రాత్రి సమయంలో అటు ఇటు తిరుగుతూ ఉన్నాడు. అదే సమయంలో చెన్నై నుంచి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రావడంతో ఆ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఎర్రటి టీ షర్ట్, సిమెంట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, వివరాలు తెలియలేదని రైల్వే జీఆర్పీ ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్ఐ చెప్పారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌కు చెందిన మహేష్‌బాబు(34) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మహేష్‌బాబు ఈనెల 1వ తేదీన పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబసభ్యులు గమనించి వేలూరులోని ఆస్పత్రికి తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

వడ్డిపాలెంలో ఘర్షణ

ముగ్గురిపై కేసు

పెళ్లకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెంలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మద్దూరు కోటేశ్వరరావుపై మద్దూరు చందు, చల్లా చెంచు కృష్ణయ్య, చల్లా చెంచయ్య దాడి చేశారు. బాధితుడు ఇచ్చిన ఫర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతులకు అందుబాటులో గోదాములు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దామానెల్లూరు ప్రాథమిక సహకార సంఘంలో ధాన్యం దాచుకొనేందుకు గోదాములు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ సీఈవో రామయ్య తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'ధాన్యం దాచుకునేందుకు చోటేదీ?' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో సీఈవో స్పందించారు. దామానెల్లూరు సహకార సంఘ పరిధిలో రైతులు పండించిన ఉత్పత్తులను దాచుకొనేందుకు నాలుగు గోదాములు ఉన్నాయన్నారు. ఇందులో దాదాపు 17 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసుకోవచ్చని పేర్కొన్నారు. దామానెల్లూరు, డేగవారి కండ్రిగ, సుద్దమడుగుతాగేలి, మంగానెల్లూరు, మంగళంపాడు, ఇలుపూరు, నుగ్గుపల్లి, వెలగలపొన్నూరు గ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని రామయ్య కోరారు.

వృద్ధురాలి సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి నుంచి మూడు సవర్ల సరుడును గుర్తుతెలియని యువకుడు అపహరించుకుని వెళ్లాడు. నాయుడుపేట పట్టణంలోని నివాసం ఉంటున్న జయమ్మ(80) గురువారం ఉదయం ఇంటి ముందు కూర్చొని ఉండగా గుర్తుతెలియని యువకుడు మోటారు సైకిల్‌పై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల సరుడును లాక్కొని పరారయ్యాడు. వెంటనే సమీపంలో ఉన్న మహిళలు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలికి చేరుకున్న అర్బన్ సీఐ బాబి వివరాలను నమోదు చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





డేగలపాలెం చెరువులో వ్యర్థాలు, పిచ్చిమొక్కలు - చెరువు గట్టున ఉన్న బోరు పాయింట్లు

సరఫరా చేస్తున్నది మంచి నీరేనా?

- డేగలపాలెం చెరువు నిండా వ్యర్థాలే
- బోరు పాయింట్లు కూడా కనిపించని వైనం
- అక్కడి నుంచే పట్టణానికి తాగునీరు
- నాణ్యతపై ప్రజల్లో అనుమానాలు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంతో పాటు మండలంలోని కేసీయన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు తాగునీరందించే బోర్లు ఉన్న డేగలపాలెం చెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చెరువులో 10 బోర్లు వేసి అక్కడ నుంచి పైపులైన్ల ద్వారా ఓవర్‌హెడ్ ట్యాంకులను నింపి పట్టణవాసులకు, కేసీయన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీల ప్రజలకు తాగునీరందిస్తున్నారు. మొత్తం 10 బోరు పాయింట్లలో రెండు చెరువులో పూడిపోయాయి. మిగిలిన 8 పాయింట్లలో 6 బోర్ల నుంచి మున్సిపాలిటీ పరిధిలోని బాపూజీ కాలనీ, రాజీవ్ నగర్, కోళ్లమిట్ట, ఇసుక మిట్ట, స్వతంత్రపురం, సోనియాగాంధీ నగర్, కసారెడ్డి పాలెం, కేఆర్‌పాలెం ప్రాంతాలకు(మున్సిపాలిటీ పరిధిలో సగ భాగానికి) తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అదే విధంగా మండల పరిధిలోని కేసీయన్ గుంట, మన్నెముత్తేరి పంచాయతీలకు రెండు బోర్ల నుంచి తాగు సరఫరా అవుతోంది. అయితే డేగలపాలెం చెరువు మొత్తం వ్యర్థాలతో పాటు పిచ్చి మొక్కలతో నిండిపోయింది. దీనికి పట్టణంలోని మురుగుతో పాటు నివాస గృహాల్లో వ్యర్థపు నీరంతా చెరువులోకి చేరుతోంది. అలాగే వర్షాకాలంలో కాలువలు, రోడ్లపై ప్రవహించే మురుగు నీరంతా చెరువులోకి చేరుతోంది. నీటి పథకాలను పర్యవేక్షణ చేసి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి డేగలపాలెం చెరువులో వ్యర్థాలు కలవకుండా చర్యలు తీసుకొని మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.25 కోట్లతో సిమెంటు రోడ్లు: విజయశ్రీ



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజవర్గంలో రూ.25 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. దొరవారిసత్రం మండలం ఉచ్చూరు పంచాయతీ తిమ్మనాయుడు కండ్రిగలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో అన్ని గ్రామాలను వచ్చే ఐదేళ్లలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు నాయుడు, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఇట్టగుంట రత్నయ్య, నాయకులు ఇట్టగుంట మల్లేయ్య, నాగయ్యనాయుడు, సంచి విజయ్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు

బాలాయపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం స్వయం ఉపాధి రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వినీల్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు తగిన ధృవీకరణ పత్రాలతో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హాజరుకావాలన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫింగర్ ప్రింట్ స్కానర్



ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను ప్రారంభిస్తున్న సీఐ మురళీకృష్ణ, పక్కన ఎస్ఐ బ్రహ్మానాయుడు తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నేరస్తులను సులువుగా గుర్తించేందుకు సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను అందుబాటులోకి తెచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ మురళీకృష్ణ ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను గురువారం ప్రారంభించారు. కంప్యూటర్ స్కానర్ సాయంతో అనుమానితుల ఫింగర్ ప్రింట్లు తీసుకోవడం ద్వారా నిందితులను సులువుగా గుర్తించవచ్చని సీఐ తెలిపారు. ఎస్ఐ బ్రహ్మానాయుడు సిబ్బంది ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

చిల్లకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నెలబల్లిరెట్టపల్లి హెచ్ఎం విజయలక్ష్మి అన్నారు. జాతీయస్థాయి జంప్ రోప్ పోటీల్లో బంగారు పతకం సాధించిన 9వ తరగతి విద్యార్థి వెంకటేష్‌కు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ రాజనేని శ్రీనివాసులు నాయుడు సహకారంతో రూ.10వేలు ప్రోత్సాహక నగదు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని చదువులు, క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి ప్రజేంద్రరెడ్డి, పీడీ మస్తాన్‌బీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి బోధన అందించాలి



యాప్ ద్వారా అవగాహన కల్పిస్తున్న రిసోర్స్ పర్సన్, సీడీపీవో

కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్పొరేట్ స్థాయి విద్యా బోధనపై అందించాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోటలోని బాలుర ఉన్నత పాఠశాలలో 3వ రోజు గురువారం అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల మానసిక అభివృద్ధిని గుర్తించాలన్నారు. అదే విధంగా విద్యాబోధనలో వస్తున్న మార్పులను ప్రయోగాత్మకంగా వివరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మ, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

పెన్నక్క చెరువుకు స్వర్ణముఖి జలాలు

కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలి స్వర్ణముఖినది నుంచి మిగులు జలాలను గురువారం పెన్నక్క చెరువుకు రైతులు మళ్లించుకున్నారు. పెన్నక్క చెరువు ఆయకట్టు కింద కింద కోట, చిల్లకూరు మండలాల పరిధిలో 8,500 ఎకరాల వరి పంటలకు రెండు తడులు సాగునీరు అవసరం ఉంది. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో పెన్నక్క చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వర్ణముఖినది నుంచి మామిడి కాలువ మీదుగా నీటిని మళ్లించారు.

రుణాల దరఖాస్తుల పరిశీలన

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాలకు కోసం అందిన దరఖాస్తులను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, బ్యాంకు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తులన్నింటినీ పరిశీలించి తుది జాబితాను ఆయా కార్పొరేషన్‌లకు పంపిడం జరుగుతుందన్నారు.

గురువుకు శ్రీసిటీ ఎండీ నివాళి



రాజయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

చిట్టమూరు, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం, మన్నెమాల గామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తుమ్మల రాజయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన కుమారుడు జాన్సన్ నివాసం ఉంటున్న నాయుడుపేట మండలంలోని గొట్టిప్రోలు గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువు మృతి చెందారని తెలుసుకున్న శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి గురువారం గొట్టిప్రోలు గ్రామానికి చేరుకొని రాజయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన భార్య జయమణి, కుమారుడు జాన్సన్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డ్రోన్‌తో దోమల మందు పిచికారీ

నాయుడుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు డ్రోన్‌తో మందు పిచికారీ చేయడం ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట నారాయణ పాఠశాల ప్రాంతంలో గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లాతో కలిసి డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అవధానం సుధీర్, మొండెం బాబు, ముత్యాలయ్య, ధనంజయ, బాబు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రామానాయుడు

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్ ప్రాజక్టులన్నీ పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామా నాయుడు అన్నారు. గురువారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాగునీటి రంగ సమస్యలపై ఈనెల 22నుంచి 24వ తేదీ వరకు కడపలో మహా సభలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలకృష్ణయ్య, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షయవ్యాధి, వాటి లక్షణాల గురించి క్షుణ్ణంగా వివరించారు. రెండు వారాలకు పైగా దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వాస్పత్రికి వెళ్లి గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీని ఉన్నట్లు నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.శేఖర్, టీబీ సూపర్‌వైజర్ బాల, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నేతకు పలువురి శుభాకాంక్షలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జనసేన మండల అధ్యక్షుడు మల్లాం విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను చెంబేడులో గురువారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, కూటమి నేతలు మస్తాన్‌రెడ్డి, సందీప్, వేణు, బాబి, వంశీ, జనార్దన్ పుష్ప గుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

విద్యానగర్‌లో రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి

కోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో గల నేదురుమల్లి సుబ్బరామిరెడ్డి కళాభవన్‌లో గురువారం మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి 90వ జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. జనార్దనరెడ్డి చిత్రపటానికి నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళి, వైసీపీ నాయకులు యల్లశిరి గోపాల్‌రెడ్డి, దేవారెడ్డి నాగార్‌రెడ్డి, దేవారెడ్డి షనీల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంకుమార్‌రెడ్డితో పాటు ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్, ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు, అధ్యాపకులు రక్తదానం దానం చేశారు. కార్యక్రమంలో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, మేనేజర్ రామకృష్ణారెడ్డి, ఆయా విభాగాధిపతులు పాల్గొన్నారు.

వాకాడులో జనార్దనరెడ్డి జయంతి

వాకాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌పిల్లర్ వద్ద ఉన్న నేదురుమల్లి జనార్దనరెడ్డి విగ్రహానికి ఆయన తనయుడు రాంకుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, దువ్వూరు విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు అంధుల జూడో జట్టు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన అంధుల జూడో జట్టు

వెంకటగిరి, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే అంధుల జాతీయస్థాయి జూడో పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు ఏపీ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చూరి నరసయ్య తెలిపారు. గురువారం ఆయన వెంకటగిరిలో మీడియాతో మాట్లాడుతూ ఏపీ బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధుల జూడో జట్టు జాతీయ పోటీల్లో సత్తా చాటుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ముప్పాళ శేషగిరిరావు, ఇనగంటి వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో ఉన్న రైల్వే పోలీస్‌కు తీవ్ర అస్వస్థత

నాయుడుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న రైల్వే పోలీస్ గణేషన్ తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఈ ఘటన నాయుడుపేట రైల్వేస్టేషన్‌లో గురువారం తెల్లవారుజామున జరిగింది. విధుల్లో ఉన్న గణేషన్ తీవ్ర అస్వస్థతకు గురై కిందపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అదే సమయంలో ప్లాట్‌ఫాంపై వాకింగ్ చేస్తున్న టీడీపీ నాయకుడు పనబాక గంగబాబు గుర్తించి హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వెంటనే సూళ్లూరుపేట రైల్వే ఎస్ఐకు సమాచారం ఇవ్వడంతో ఆయన సిబ్బందితో నాయుడుపేటకు చేరుకుని గణేషన్‌ను చెన్నైకు తరలించారు.

జాతీయ ఉపకార వేతనానికి విద్యార్థుల ఎంపిక

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే జాతీయ ఉపకార వేతనానికి సూళ్లూరు పేటలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.తీర్థ, కె.స్మయిలీ, బి.సింధూ ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు కె.శేఖర్ తెలిపారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12,000 చొప్పున ఉపకార వేతనం అందుతుందని చెప్పారు.



విద్యార్థులతో హెచ్ఎం శేఖర్

వాకాడు మండల సమావేశం

వాకాడు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్త్రీశక్తి భవనంలో గురువారం ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ ఆధ్వర్యంలో మండల సమావేశం జరిగింది. ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి గురించి అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటరమణయ్య, ఎంపీడీవో అన్నపూర్ణారావు, ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శకుంతల, ఏపీవో విజయమ్మ, ఏవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అన్నపూర్ణారావు